ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కుమరం భీం
జిల్లా వార్తలు
6
మంగళవారం 3 జూన్ 2025

పాఠ్య పుస్తకాల పంపిణీ

వాంకిడి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం స్థానిక ఎంఆర్సీ కార్యాయలంలో ఎంఈవో శివచరణ్‌కుమార్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలను మండల విద్య వనరుల కేంద్రం నుంచి తీసుకు వెళ్లాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినేష్, మహేష్, రాజేశ్వరి, గౌతమి, సీఆర్పీలు సందీప్, సునీల్, విజయ్‌బాబు, ఐఆర్పీ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

- అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్

సమగ్రాభివృద్ధే ధ్యేయం



జెండా ఎగుర వేస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్



మాట్లాడుతున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్



వేదికపై కూర్చున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్ తదితరులు

ఆసిఫాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో రాష్ట్రం సమగ్ర అభివృద్ధి దిశా సాగు తుందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అమర వీరుల స్థూపాన్ని నివాళులు అర్పించి పోలీసుల గౌరవమైన స్వీకరించి అనంతరం జాతీయ జెండా ఆవిష్క రించిన తరువాత ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడుతూ 18 నెలల్లో పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా దేశంలోనే కాకుండా ప్రపంచంలో రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైసింగ్ 2047 లక్ష్యంతో ముందుకు సాగుతు న్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలను ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పేద ప్రజలకు మేలు చేసే పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గృహజ్యోతి లాంటివి అమలు చేసినట్లు తెలిపారు. సరైన లబ్ధిదారులను గుర్తించి అర్హత గల వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేలా పటిష్ట చర్యలు తీసుకుంటు న్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల్లో జిల్లాలో ఒక కోటి మంది మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసినట్లు తెలిపారు. 73 వేల కుటుంబాలకు రూ.500లకు వంట గ్యాస్ అందిస్తున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు 72 వేల కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా జిల్లాలో మొదటి విడతగా 1,669 ఇళ్లు మంజూరయ్యాయని అన్నారు. రెండో విడుతలో 4,410 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి ఇప్పటికే 150 బస్సులు వారికి కొనుగోలు చేసి అందించగా వారికి 600 బస్సులు కొనుగోలు చేయాలని ఆర్టీసీకి అద్దె ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడు మహిళా శక్తి క్యాంటీన్లను కూడా ఏర్పటు చేసినట్లు తెలిపారు. కుల గణణ చేసి బీసీలకు 41 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్లు వివరించారు. యువతకు ఉపాధి కల్పిస్తామని ఎన్నికల్లో చెప్పిన హామి మేరకు మొదటి ఏడాది 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు రాష్ట్రంలో భర్తీ చేయగా జిల్లాలో 12 జాబు మేళాలు నిర్వహించి 112 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించినట్లు తెలిపారు. విద్యావ్యవస్థలు సమూల మార్పులు తీసుకు వచ్చామని దీనిలో భాగంగా జిల్లాలో 284 పోస్టులు భర్తీ చేశామని, రాష్ట్రాన్ని ట్రిలియన్ డాటర్ ఎకానమీ రాష్ట్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచ వేదికపై ఆవిష్కరించడంలో విజయం సాధించామని చెప్పారు. దీనికి నిదర్శణమే వివిధ రకాల ప్రపంచ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత నుంచి భూ సమస్య లతో బాధపడుతున్న రైతులకు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చామని క్షేత్రస్థాయిలో దీనికి సంబంధించి రైతుల నుంచి మద్దతు రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత కొత్త కుటుంబాలకు ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని తాము నూతన రేషన్ కార్డులు ఇస్తూ చరిత్ర తిరగ రాస్తున్నామన్నారు. 14 నుంచి 18 సంవత్సరాల కౌమార దశ బాలికలకు రక్తహీనత నివారణ కోసం చిక్కీలను అందజేయడానికి నిర్ణయం తీసుకోగా ఆసిఫాబాద్ ఆస్పరేషన్ జిల్లాగా ఎన్నుకు న్నట్లు వివరించారు. అధికారుల సమన్వయంతో జిల్లా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ గడిచిన 18 నెలల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దశగా ప్రయత్నాలు చేసు్తన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● మొదటి విడతలో..

జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన నాణ్యతమైన విత్త నం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొదటి విడతలో 1,203 మంది రైతులకు 1,203 ఎకరాల్లో విత్తనాలు అందజేయడానికి నిర్ణయించారు. ఈ మేరకు మండలి డిప్యూటీ చైర్మన్ చేతుల మీదుగా పది మందికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో అందజేశారు. 02ఏఎస్ఎఫ్02:

● ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

ఆసిఫాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారి హోదాలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అటవీ శాఖ కార్యాలయంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ కాఆ్యలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, జాతీయ జెండాలను ఆవిష్కరించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మండలంలో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కవిత, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బస్టాండు ఏరియాలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక రాజీవ్ గాంధీ చౌరస్తాలో బీఆర్ఎస్ సిర్పూరు తాలుకా కన్వీనర్ లెండు గురే శ్యాం రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సీపీ విద్యావతి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

చింతలమానేపల్లి (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో డీటీ దౌలత్, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎస్సై నరేష్, మాజీ ఎంపీపీలు నానయ్య, వెంకయ్య, నాయకులు మల్లయ్య, మురళీ, మారుతి, శ్రీను, లాంచు, నీలాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, రైతు వేదికలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ మునావర్ షరీఫ్, ప్రత్యేకాధికారి సజీవన్, ఎస్సై విక్రమ్ పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఏవో నాగరాజు, జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంఈవో సునిత తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాయలంలో తహసీల్దార్ శ్రీనివాస్ పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో మల్లేష్, ఏవో వినయ్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 96 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి నిర్మాణ పనులను ప్రారంభించారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో అంజద్‌పాషా, ఎస్సై మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ వేడుకలను నిర్వహిం చారు. ఆయా కార్యక్ర మంల్లో తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో ఆల్బర్ట్, ఎస్సై కొ మురయ్య, ఏవో మనీషా, ఎంఈవో రమేశ్‌బాబు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రత్యకాధికారి సత్యనారాయణ, ఎస్సై కమలాకర్, ఏవో గిరీష్‌కుమార్, ఎఫ్ఆర్వో కార్యాలయంలో ఎఫ్ఆర్వో ఎక్బాల్ హుస్సేన్, కోర్టులో న్యాయ మూర్తి అజయ్ అలోల, తహసీల్దార్ మహ్మద్ రహీముద్దీన్ పాల్గొన్నారు.

జైనూర్/సిర్పూర్(యు)/లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో సోమవారం తెలంగాణ అవిర్భావ దనోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవోలు సుధాకర్ రెడ్డి, క్రిష్ణారావ్, రాంచందర్, తహసీల్దార్లు ఆడ బీర్షావ్, ప్రహ్లాద్, నాగరాజు గౌడ్, గ్రామ కార్యదర్శులు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ప్రమోద్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రామీణ పేదరికి నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఏపీఎం ముక్తేశ్వర్ తలకిందులుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గుర్తించి జెండాను కిందికి దింపి మళ్లీ ఎగురవేశారు.

● అలరించిన నృత్యాలు..



ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా జడ్పీ ఎస్ఎస్ పాఠశాలకు చెందిన శానివి, గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యంతో పాటు కెరమెరి హట్టి విద్యార్థులు చేసిన గోండు నృత్యం ఆకట్టుంది. జిల్లా పౌర సంబంధాల శాఖాధికారి ఆధ్వర్యంలో సాంస్కృతిక సారథి బృందం సభ్యులు పాటలతో అలరించారు.





జడ్పీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డీసీసీ కార్యాలయంలో వందనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమరుల త్యాగాలతోనే ప్రత్యేక తెలంగాణ



జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అమరుల త్యాగాలతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కాగజ్‌నగర్ పట్టణంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నివాసంతో పాటు తెలంగాణ చౌక్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో ప్రాణత్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. అమరులైన వారికి ఈ సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మహిళా కమిషన్ సభ్యులు

జైనూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్ సభ్యురాలు నీలబాయి, కుంర ఈశ్వరీబాయిలు సోమవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సామాజికంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్య లు, వారి ఉన్నతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నిత్యజీవింతో మహిళలపై జరుగుతున్న దాడులు వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు మహిళలకు ఉద్యోగ ఉపాధి తదితర అంశాలపై చర్చించారు. ఎస్టీ తెగలకు ఉన్నత విద్యను అందించే విధంగా గ్రామాల్లో ఆవగాహన కల్పించాలని వారు నిర్ణయించారు.

జిల్లా ఆసుపత్రిలో మెరుగైన సేవలు

ఆసిఫాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రిలో వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ అన్నారు. స్థానికంగా సోమవారం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎముకలు విరిగినప్పుడు వేసే రాడ్ లేదా వివిధ రకాల ప్లేట్స్ కొన్నాల్ల తర్వాత తీసివేయాల్సి ఉంటుందన్నారు. దీన్ని ఆసుపత్రిలో ప్రారంభించామని తెలిపారు. బెజ్జూరు మండల కేంద్రానికి చెందిన రాంచరణ్(14) అనే వ్యక్తికి ఐదేళ్ల క్రితం ప్రమాదంలో విరిగిన కాలుకు వేసిన ఇనుప రాడ్‌ను (ఇంప్లాంట్ రిమూవల్ ఆఫ్ క్లావికల్ బోన్ ఆపరేషన్) తో తొలగించా రన్నారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఉండడంతో రానున్న రోజుల్లో జిల్లా ఆసుపత్రిలో హెర్నియా, ట్యూబెక్టమీ, వ్యాసక్టమీ ఆపరేషన్‌లు కూడా అందుబాటు లోకి రానున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణ, సుభాష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ డేవిడ్

సిర్పూర్(టి), జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. సోమవారం సిర్పూర్ (టి) మండలం టోంకిని, పారిగాం, లోనవెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా గ్రామీణాభివృద్ది అధికారి దత్తారావు, జిల్లా సహకార అధికారి బిక్కులతో కలిసి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంను రైస్ మిల్లులకు తర లించాలని సూచించారు. వారి వెంట తహసీల్దార్ రహీముద్దీన్, తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి అభినందన

ఆసిఫాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిర్పూర్(యూ) మండలానికి చెందిన గెడం సుహాసిని ఆసియా కప్ అత్యపత్య పోటీలో ప్రతిభ చాటి గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థినిని సోమవారం పలువురు అభినందించారు.. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో నిర్వహించిన పోటీల్లో ఇండియాతో పాటు బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవ్స్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఇండియా తరపున సుహాసిని పాల్గొని బంగారు పతకం సాధించడం జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు.సుహాసిని క్రీడల్లో రాణించాలని సూచిస్తూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆమెకు రూ.25 వేల ఖర్చులకు అందజేశారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత

పెంచికలపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్ భూమి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాటా్లడుతూ లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆల్బర్ట్, నాయకులు చంద్ర మౌళి, కాంతారావు, పురుషోత్తం, నాగన్న, శ్రీనివాస్, శంకర్, కృష్ణ, సంతోష్, రాజు పాల్గొన్నారు.

దహెగాం (ఆంధ్రజ్యోతి): కల్వాడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌గౌడ్, దామోదర్, తిరుపతిగౌడ్, ధనుంజయ్, ప్రదీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): రెండో విడతలో ఇప్ప పార్వతి అనే లబ్ధిదారుకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాన్ని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అందజేశారు. అనంతరం భూమి పూజ చేశారు. ఇంటి నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఓ మనోహర్, ఎంపీడీఓ కోటప్రసాద్, ఎ.ఇ. మహేష్, కార్యదర్శి శ్వేత రాణి, తదితరులు పాల్గొన్నారు.



పెంచికలపేటలో మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

బెజ్జూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలంలోని గూడెం గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు పెద్దపల్లి జిల్లాకు చెందిన గౌస్‌ఖాన్, సల్మాన్ ఖాన్‌లు గూడెం నుంచి బొలేరో వాహనంలో ఆరు పశువులను తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు సబ్ స్టేషన్ వద్ద సోమవారం ఉదయం వాహనాల తనిఖీలు నిర్వహిం చగా బొలేరో వాహనంలో పశువులు లభ్యమైనట్లు ఎస్సై చెప్పారు. పట్టుబడ్డ నిందితులను విచారించగా పెద్దపల్లి జిల్లాకు తరలిస్తున్నామని ఒప్పుకున్నారని అన్నారు. వాహనాన్ని స్వాధీన పర్చుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామదేవతల ఊరేగింపు



గ్రామదేవతలను ఊరేగిస్తున్న భక్తులు

చింతలమానేపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జెల్లి గ్రామంలో సోమవారం గ్రామ దేవతలను ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి గ్రామదేవతలను తీసుకు వస్తారు. మహిళలు గ్రామస్థులు ప్రత్యేక మొక్కులు చెల్లించుకు న్న అనంతరం మూడు రోజుల్లో కార్యక్రమాన్ని ముగించుకొని గంగస్నాం, బోనాలు పోయడం అనవాయితీగా వస్తుందని చెబుతున్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

దహెగాం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కల్వాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భం గా ధ్వజస్తంభం ఆవిష్కరణ, విగ్రహాప్రతి ష్టాపన కార్యక్రమాలను వేదపండితులు రాజేంద్ర ప్రసాద్ శర్మ, ప్రణయ్‌శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్చరణల మధ్య ప్రతిష్ఠించి పత్యేక పూజ లు నిర్వహించారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

భారీ వర్షం కురిసిన తర్వాతే

విత్తనాలు పెట్టుకోవాలి

● నాగరాజు, వ్యవసాయాధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు విత్తనాలు పెట్టుకుంటే ఏం సమస్యలు తలెత్తుతాయి?

ఏవో: భారీ వర్షాలు కురిసాకే విత్తనాలు పెట్టుకోవాలి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం వల్ల భూములను లోతుగా దున్నాలి. అప్పుడు వర్షపు నీరు భూమిలోకి ఇంకి తేమ శాతం పెరుగుతుంది. రేగడి భూములకు 100 మిల్లీమీటర్లు, ఇతర భూములకు కనీసం 70 మిల్లీమీటర్ల వర్షం కురిస్తే విత్తనాలు వేసేందుకు అనుకూలంగా ఉంటంది.

ఆంధ్రజ్యోతి: కురిసిన వర్షాలు ఏఏ పంటలకు కలిసి వస్తాయి?

ఏవో: ఇటీవల కురిసన వర్షాలకు పెసరు, పచ్చజొన్నల సాగుకు అనుకూలంగా ఉన్నా యి. మిగితా పంటలకు అనుకూలం కాదు. రైతులు అధికారుల సూచనలు పాటించాలి.

ఆంధ్రజ్యోతి: రోహిణి కార్తెలో పంట వేస్తే దిగుబడి ఉంటుందని రైతులు చెబుతున్నారు?

ఏవో: పంటల సాగుకు రోహిణి కార్తె కలిసి వస్తుంది. పదేళ్ల తరువాత మొదటి సారి రోహిణి కార్తెలో వర్షాలు కురిశాయి. అలాగే వారం రోజులు విస్తారంగా వర్షాలు కురిసి మరో వారం కురియక పోయినా పెసర, జొన్న, పత్తి తట్టుకోగలవు. విత్తిన తరువాత వరుసగా 15 రోజులు వర్షం కురివక పోతే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

- బెజ్జూరు, ఆంధ్రజ్యోతి

రండి.. ప్రభుత్వ కాలేజీల్లో చేరండి..

● విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యక చర్యలు

● కరపత్రాలతో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు



వాంకిడి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు (ఫైల్)

వాంకిడి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు పెంచేందుకు అధ్యాపకులు నడుం బిగించారు. 'రండి.. ప్రభుత్వ కాలేజీల్లోనే చేరండి' అంటూ క్యాంపెయిన్ ప్రారంభించారు. గతంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఏజెంట్లను నియమించుకొని ఇలా ప్రచారం చేసేవి. పదో తరగతి పిల్లల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి.. ఇళ్లకు వెళ్లి అడ్మిషన్లు కోరేవారు. ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్ మార్కులే కీలకం కావడంతో తల్లిదండ్రులు ఎక్కువగా కార్పొరేట్ కాలేజీల వైపు మొగ్గు చూపుతు న్నారు. ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు బాగా తగ్గిపోయాయి. దీంతో అధ్యాపకులు విద్యార్థుల ఇంటి బాట పట్టి తమ కాలేజీలో చేరాలని కోరుతున్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలుస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లోని సౌకర్యాలపై పిల్లలకు, వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. అధ్యాపకులు ఉదయం నుంచి గ్రామా ల్లో ప్రచారం చేస్తున్నారు. కళాశాల్లో ఈ సంవత్సరం సాధించిన ఫలితాలు, టాపర్ల చిత్రాలు, మార్కులతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 22 నుంచి ప్రవేశాలు ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఆయా కళాశాలల అధ్యాపకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. వేల రూపాయల ఫీజులు చెల్లించి ప్రైవేట్ కళాశాలల్లో చదివే కంటే ఉచిత విద్యతో పాటు ఉపకార వేతనాన్ని పొందే అవకాశం ఉన్న ప్రభుత్వ కళాశాలలపై అవగాహన కల్పిస్తున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన కొనసాగుతుందని ప్రతి ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో సాధిస్తున్న ఉత్తీర్ణతపై వివరిస్తున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలకు పంపించాలని కోరుతున్నారు. నాణ్యమైన విద్యను అందిస్తామని తెలియజేస్తున్నారు.

మెరుగైన విద్య అందిస్తున్నాం..

చంద్రయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వాంకిడి



ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నాం. ఇటీవల పదోతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను కలిసి కళాశాల లో సౌకర్యాలపై వివరిస్తున్నాం. వచ్చే ఏడాది సైతం మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం. కళాశాలల్లో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం, తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించాలి.

ప్రభుత్వ కళాశాలల్లో కోర్సులు..

జిల్లాలోని ప్రభుత్వ కళాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులతో పాటు అదనంగా వృత్తి విద్యా కోర్సులున్నాయి. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కౌటాల, రెబ్బెన కళాశాలల్లో అదనంగా వృత్తి విద్యాకోర్సులు ఎంఎల్‌టీ, కంప్యూటర్ సైన్స్, అకౌంట్స్, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు కొనసాగుతున్నాయి. ఆసిఫాబాద్, వాంకిడి, బెజ్జూరు, దహెగాం, సిర్పూర్(యు), రెబ్బెన, కెరమెరి, తిర్యాని, కాగజ్‌నగర్, జైనూర్, కౌటాల కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులున్నాయి.

ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు..

- ఉచిత అడ్మిషన్లు, పాఠ్యపుస్తకాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు
- దూర ప్రాంత విద్యార్థులకు బస్‌పాస్ సౌకర్యం
- కళాశాల ప్రారంభం నుంచి స్టడీ అవర్స్, చాప్టర్ల వారీగా పరీక్షల నిర్వహణ, నీట్, జేఈఈ మేయిన్స్ పరీక్షలకు సన్నద్ధం
- వార్షికపరీక్షలకు ప్రత్యేక ప్రణాళిక
- ఇంగ్లీష్, తెలుగు మిడీయం విద్యార్థులకు బోధన

పోడు రైతుల సమస్య పరిష్కారానికి కృషి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

పెంచికలపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పోడు రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. నాలుగు రోజులుగా తమ పోడు వ్యవసాయ భూమి విముక్తి కోసం అటవీ శాఖాధికారులతో పోరాడుతున్న జైహింద్‌పూర్ గ్రామస్థులు ఎమ్మెల్సీ దండే విఠల్ హామీతో ఆందోళన విరమించారు. సోమవారం ఎమ్మెల్సీ సమస్యాత్మకమైన వ్యవసాయ ప్రాంతానికి పరిశీలించి పోడు రైతులతో మాట్లాడారు. అనంతరం అటవీ శాఖాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి రెండు రోజుల్లో సమస్యపై చర్చించి సత్వర పరిష్కారం తీసుకొద్దామని చెప్పారు. వెంటనే అధికారులను పేద ప్రజల భూముల నుంచి వెనుదిరిగాలని చెప్పారు. దీంతో అధికారులు వెనుతిరిగి వెళ్లి పోయారు. కార్యక్రమంలో నాయకులు సిడాం గణపతి, సుధాకర్, చంద్రమౌళి, కృష్ణ, రాజన్న, సదాశివ్ పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): ఆరెకులస్తుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. దహెగాం మండలం ఇట్యాల గ్రామంలో సోమవారం ఎమ్మెల్సీ దండె విఠల్, ఆరె సంఘం నాయకులతో కలిసి ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లడుతూ గ్రామాల్లో ఆరెకులస్తులు శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జయరాం, శ్రీరామరావు, గంగమ్మ, బ్రహ్మయ్య, సత్యనారాయణ, జయ లక్ష్మి, సురేష్, నారాయణ, తుకారాం, మధుకర్, శ్రీనివాస్, బక్కయ్య పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సిర్పూర్(టి), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిర్పూర్(టి) రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ సూచించారు. ఈ మేరకు సోమవారం రాత్రి గ్రామాల్లో డప్పు చాటింపు చేయించారు. ఏనుగు కుమరం భీం జిల్లాకు వచ్చే అవకాశం ఉందని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అధికారులు సమాచారం ఇచ్చారని చెప్పారు. అటవీ ప్రాంతాల్లోని భూముల్లో వ్యవసాయ పనులకు వెళ్లే వారు గుంపులుగా ఉండాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలతో దిగుబడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో నాణ్యమైన విత్తనాలు వాడితేనే దిగుబడులు వస్తాయని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. కాగజ్‌నగర్ రైతు వేదికలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుకు అధిక దిగుబడులు వచ్చేలా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల సాగు, విత్తనం గురించి అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శివకృష్ణ కోట మాట్లాడుతూ కాగజ్‌నగర్ డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఈ నెల 3 నుంచి మేలైన విత్తనాలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఈ నాణ్యమైన విత్తనాలు రైతులు సాగు చేసి తదుపరి పంట ద్వారా ఉత్పత్తి అయిన విత్తనాన్ని తోటి రైతులకు తక్కువ ధరకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయా శాఖ అధికారి శ్రీనివాస రావు, ఏడీవో మనోహర్, ఎంపీడీవో, కోట ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలేవీ?



రీయింబర్స్‌మెంటు చెల్లించాలని ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు(ఫైల్)

కాగజ్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థుల ఉన్న త చదువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు నాలుగేళ్లుగా విడుదల కావడం లేదు. ఏటా పేద విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు, మెస్ చార్జీలు క్రమంగా తప్పకుండా చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వం బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో పేరుకు పోయాయి. ప్రతి నెలా కూడా ఆయా శాఖల అధికారులు నివేదికలు పంపిస్తున్నా కూడా రీయింబర్స్‌మెంటు విడుదల కాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రేపో, మాపో వస్తోందని ఎదురు చూడడమే తప్పా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు రావడం లేదు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజులు చెల్లిస్తున్నారు. బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు డిగ్రీలో చదివేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు సౌకర్యం కల్పించింది.

జిల్లాలో ఆరు కళాశాలలు..

జిల్లాలో ఆరు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి, ఈ కళాశాల్లో చదువుతున్న 1,200 మంది విద్యార్థులకు ఫీజు భారం పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంటు కల్పించడం లేదని చెబుతున్నారు. 2021-22, 2022-23, 2021-23, 2023-24కు సంబంధించిన బిల్లులు రూ.5 కోట్ల మేర పెండింగ్‌లో ఉంది. డిగ్రీ చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఏటా ఫీజు రీయింబర్స్‌మెంటు కల్పించడంతో ఫీజులు లేకున్నా ఉచితంగా చదువులు సాగిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి నిధులు రాక పోవడంతో డిగ్రి పూర్తి చేసుకున్న విద్యార్థులకు సంబంధించిన టీసీ, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలంటే యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. ఇటు ప్రభుత్వం నుంచి నిధులు రాక పోవడంతో కళాశాలలు కూడా నడుపడం కష్ట తరంగా మారిందని పలువురు ప్రైవేటు కళాశాలల యాజమానులు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఈ సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా కాలేజీల ప్రతినిధులు కోరుతున్నారు.

తెలంగాణలోనే సింగరేణి అతి పెద్ద పరిశ్రమ

మందమర్రిటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే అతి పెద్ద పరిశ్రమ సింగరేణి సంస్థ అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో సోమవారం సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భా వేడుకలకు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లినడప్పుడు తన తండ్రి మారిటోరియం ఇప్పించి సంస్థను కాపాడారన్నారు. అలాగే పింఛన్ ఇప్పించారన్నారు. కొత్త గనులు కావాలని సీఎం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన గనులను వేలం పాటల దక్కించుకోవాలని సీఎంకు విన్నవించామని చెప్పారు. త్వరలోనే కొత్త గనులపై సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో మూడిపడి గనుల ప్రారంభంపై దృష్టి పెట్టాలని కోరనున్నట్లు తెలిపారు. ఉపాధి అవకాశాల పెంపు కోసం తాను ముందుంటానన్నారు. ఒరిస్సాలోని నైని గనులను ఎలా సాధించుకున్నామో అదే తరహాలో గనులను సాధించుకోవాలన్నారు. సింగరేణి పరిసర ప్రాంతాల అభివృద్ధికి సింగరేణి పెద్ద పీట వేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలు, కార్మికుల సంక్షేమానికే కట్టుబ డి పనిచేస్తున్నానన్నారు. ఎవరికైనా సమస్యలుంటే పరిష్కరించడానికి ముందుంటా నన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అద్భుతమైన ప్రగతి సాధించామ న్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్‌యువ వికాసం, ఉచిత బస్సు, కరెంటు ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని తెలిపారు. ప్రజా సేవ కోసమే తాము రాజకీయాల్లోకి వచ్చామని, డబ్బుల కోసం కాదని, ప్రజలకు జవాబుదారిగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం దేవేందర్, సింగరేణి అధికారులు, కాంగ్రెస్ నాయకులు , ప్రజలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



గనులపై తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

సింగరేణిలోనే శ్రీరాంపూర్ ఏరియాకు ప్రత్యేక స్థానం

శ్రీరాంపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోనే శ్రీరాంపూర్ ఏరియాకు ప్రత్యేక స్థానం ఉందని జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో సోమవారం సాయంత్రం ప్రారంభించి మాట్లాడారు. బలరామ్ సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఉద్యోగులకు ఎలాంటి అవసరాలు ఉన్నా వెంటనే తీరుస్తున్నారని గుర్తు చేశారు. యేటా లాభాల వాటా పంపిణీ, సొంతింటి రుణం పై వడ్డీ చెల్లింపు, తెలంగాణ ఇంక్రిమెంట్, కారుణ్య నియామకాలు అందిస్తున్నట్లు తెలలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటి వరకు 3,821 మంకి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. 268 మంది ఉద్యోగులకు ఏకమొత్తంగా రూ.25 లక్షల చొప్పున చెల్లించామన్నారు. 18 మంది ఉద్యోగులు ఎంఎంసీ పొందారన్నారు. ఆరుగురు దివ్యాంగులకు ఉద్యోగ అవకాశం కల్పించామన్నారు. సీపీఆర్ఎంఎస్ పథకంలో 9594 మందికి మెడికల్ కార్డులు అందించామన్నారు. సామాజిక సేవ క్రింద కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. 2016లో జైపూర్ విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించుకోగా, అత్యధిక పీఎల్ఎఫ్ సాధిస్తూ జాతీయ స్థాయిలో రికార్డులు సాధించిందన్నారు. ఏరియాలో 234 మెగావాట్ల సోలార్ పవర్‌ను ఉత్పత్తి చేశామన్నారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఆర్‌కే 6 గనికి చెందిన డిప్యూటీ ఎస్ఈ శ్యామ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ నజీరుద్దీన్ అభినందనీయులన్నారు. అంతకుముందు స్టాళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, సేవా అధ్యక్షురాలు ఉమా రాణి, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణను పురస్కరించుకొని పలు గనులు, విభాగాలు, యూనియన్, పార్టీ కార్యాలయాల్లో ఉత్సవాలు జరుపుకున్నారు. జాతీయ జెండాను ఎగురవేసి, జెండాకు వందనం చేశారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. తెలంగాణ పోరాట యోధులను స్మరించుకున్నారు. శ్రీరాంపూర్ ఓసీపీపై పీవో టి. శ్రీనివాస్ జెండా గురవేయగా, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, సంక్షేమాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆర్‌కే 6 గనిపై ఇన్‌చార్జి మేనేజర్ కాదాసి శ్రీనివాస్, సంక్షేమాధికారి సురేందర్, యూనియన్ నాయకులు ముష్కె సమ్మయ్య, సంఘం సదానందం, తదితరులు పాల్గొన్నారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆర్‌కే 7, ఆర్‌కే న్యూటెక్, ఆర్‌కే 5, శ్రీరాంపూర్ ఓసీపీ, శ్రీరాంపూర్ సీహెచ్‌పీ, యూనియన్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, నాయకులు సత్తయ్య, రమేష్, సుధాకర్, రాజునాయక్, సంపత్ కుమార్, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్‌లోని కటిక దుకాణాల వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేకల దాసు జెండా ఎగురవేయగా, శ్రీరాంపూర్ సహాయ కార్యదర్శి మహేష్, మండల కార్యవర్గ సభ్యులు లచ్చన్న, వెంకన్న, రాజయ్య, సంతోష్, తదితరులు పాల్గొన్నారు. కృష్ణకాలనీలో సీపీఐ నాయకులు జెండా ఎగురవేయగా, జిల్లా కార్యవర్గసభ్యులు కారుకూరి నగేష్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి లింగం రవి, పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో అమరుల త్యాగ ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అమరులకు నివాళులర్పించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారం భించారు. ఎంవీటీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్‌ను పరిశీలించారు. సింగరేణి వివిధ డిపార్టుమెంట్లు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీలు సలేంద్ర సత్యనారాయణ, అక్బరలీ, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, పీఎం శ్యాంసుందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, అధికా రులు రామన్న, హఫీజ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి గనులు, డిపార్టుమెంట్ల వద్ద సోమ వారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. హెచ్‌వోడీలు జాతీయ జెండాలను ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. అమరులకు నివాళులర్పించారు. కేక్ కట్ చేసి తినిపించారు. కార్యక్రమంలో అధికా రులు, కార్మికులు పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే1ఏ , ఐకే ఓసీపీ గని ఆవరణలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో అధికారులు కృష్ణరావు, రవికుమార్, నాగయ్య, శంకర్, రమేష్, నవీన్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు. జైపూర్‌లోని ఎస్టీపీపీలో తెలం గాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. తెలంగాణ రన్ నిర్వహించి అనంతరం ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన అజయ్‌కుమార్‌ను శాలువాలతో సన్మానించి మెమోంటో ప్రశంసా పత్రం అందించారు. అనంతరం చిన్నారులు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు జేఎన్ సింగ్, శివ ప్రసాద్, సముద్రాల శ్రీనివాస్, మురళీధర్,మదన్‌మోహన్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చాంచల్ సర్కార్, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారాం తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, ఆంధ్రజ్యోతి): వృత్తే దైవంగా భావించాలని కైరిగూడ ఓపెన్ కాస్టు ప్రాజెక్టు అధికారి ఎం.నరేందర్ తెలిపారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుక సందర్భంగా కైరిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రతి ఉద్యోగి కూడా నిబద్ధతతో పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి క్రీడా జ్యోతిని చూపారు. కార్యక్రమంలో ప్రాజె క్టు ఇంజనీర్ వీరన్న, ఇన్‌చార్జి మేనేజర్ ఎ.నారాయణ, ఏఐటీయూసీ పిట్ సెక్రటరి ఎం శ్రీనివాస్, సీఎంఓఏఐ అధికారి నరేష్, సంక్షేమ అధికారి రజినికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో జెండా ఆవిష్కరిస్తున్న జీఎం దేవేందర్



క్రీడా జ్యోతిని చూపుతున్న కైరిగూడ ఓపెన్ కాస్టు ప్రాజెక్టు అధికారి నరేందర్

ఎవరో కొత్త కింగ్?

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



ఒకటా.. రెండా గత 17 ఏళ్లుగా ఒక్కసారైనా ఐపీఎల్ టైటిల్‌ను అందుకోవాలని ఆ రెండు జట్లు ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా పేరు తెచ్చుకున్న విరాట్ కోహ్లి కెరీర్‌లోనైతే అదో పెద్ద వెలితి. రాయల్ చాలెంజర్స్ బెంగళూరును తన నాయకత్వంలో చాన్నాళ్లు నడిపించినా చాంపియన్‌ను చేయలేక పోయాడు. కానీ 18వ సీజన్‌లో ఆ అద్భుతాన్ని సాధించేందుకు ఆర్‌సీబీ మరో విజయం దూరంలోనే ఉంది. ఇక గతంలో పంజాబ్ కింగ్స్‌పై ఎవరికీ ఎలాంటి అంచనాలు లేకపోయినా.. ప్రస్తుతం సీన్ మారింది. శ్రేయాస్ అయ్యర్ ఆ జట్టును కదం తొక్కిస్తున్నాడు. టేబుల్ టాపర్‌గా నిలపడమే కాకుండా తుది పోరుకు కూడా చేర్చాడు. ఇక ఈ రెండు టాప్-2 జట్ల మధ్య ఆసక్తికరపోరులో ఎవరు గెలిచినా తొలి టైటిల్‌తో పండుగ చేసుకుంటారు.

తొలి టైటిల్ వేటలో బెంగళూరు X పంజాబ్

నేడు ఐపీఎల్ -18 ఫైనల్

అహ్మదాబాద్: ప్రపంచ క్రికెట్‌లో అతి భారీ టీ20 లీగ్ అయిన ఐపీఎల్ ఆఖరి అంకానికి చేరింది. లక్షకు పైగా సీటింగ్ సామర్థ్యం కలిగిన నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు (మంగళవారం) జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు- పంజాబ్ కింగ్స్ టైటిల్ కోసం తలపడనున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే లీగ్ ముగియాల్సి ఉన్నా.. భారత్-పాక్ యుద్ధం కారణంగా వారం పాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఇక ఆర్‌సీబీ తుది పోరులో తలపడడం ఇది నాలుగోసారి. 2009, 2011, 2016ల్లో టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా రన్నరప్‌గానే నిలిచింది. 'ఈ సాల కప్ నమ్దే' అంటూ బెంగళూరు జట్టు అభిమానులు ప్రతీసారి హోరెత్తిస్తుంటారు. వీరి నమ్మకాన్ని నిలబెడుతూ ఈసారి అదిరే ప్రదర్శనతో జట్టు తుదిపోరుకు చేరి అంచనాలను మరింత పెంచింది. ముఖ్యంగా విరాట్ అభిమానులు నెంబర్ 18 జెర్సీలతో స్టేడియంలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. అటు బెంగళూరులో హడావిడి మామూలుగా లేదు. రెస్టో బార్స్, పబ్స్‌లతో పాటు భారీ జెయింట్స్ స్ర్కీన్లపై ఫైనల్‌ను తిలకించేందుకు ఫ్యాన్స్ సిద్ధమవుతున్నారు. మరోవైపు క్వాలిఫయర్1లో ఆర్‌సీబీ చేతిలోనే చిత్తుగా ఓడిన పంజాబ్ కింగ్స్ తిరిగి తుది పోరులోనూ అదే జట్టును ఢీకొనాల్సి వచ్చింది. ఆదివారం ఇదే మైదానంలో ముంబైని చిత్తు చేసిన అనుభవంతో ఈసారి బెంగళూరుకు గట్టి పంచ్ ఇవ్వాలనుకుంటోంది. 2014లో ఒక్కసారి మాత్రమే పంజాబ్ ఫైనల్లో అడుగుపెట్టింది.

ప్రతీకారంతో పంజాబ్

టేబుల్ టాపర్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్ క్వాలిఫయర్1లో ఎదురైన పరాభవంతో ఒక్కసారిగా డీలా పడింది. ఆర్‌సీబీ ధాటికి కేవలం 101 పరుగులకే పరిమితం కావడంతో షాక్‌కు గురైంది. కానీ అలాంటి స్థితి నుంచి వెంటనే తేరుకుని, ఐదు సార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను క్వాలిఫయర్ 2లో మట్టి కరిపించిన విధానం అదుర్స్. కెప్టెన్ శ్రేయాస్ ఆడిన ఇన్నింగ్స్ క్రికెట్ ప్రేమికులను ఉర్రూతలూగించగా, 11 ఏళ్ల తర్వాత జట్టు ఫైనల్‌కు చేరింది. గతేడాది కేకేఆర్ కెప్టెన్‌గా ఆ జట్టుకు టైటిల్ అందించిన శ్రేయాస్‌పై.. ఇప్పుడు పంజాబ్‌ను గెలిపించే బాధ్యత ఉంది. తన రూ.26.75 కోట్ల ధరకు 603 పరుగులతో న్యాయం చేస్తున్నాడు. అతడితో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శశాంక్ సింగ్, స్టొయినిస్ ఎదురుదాడికి సిద్ధంగా ఉన్నారు. అయితే పేసర్ జాన్సెన్ లేకపోవడంతో వీరి బౌలింగ్ కాస్త బలహీనంగా కనిపిస్తోంది. అయినప్పటికీ బ్యాటింగ్ పిచ్‌పై ముంబైని మరీ భారీ స్కోరు చేయనీయకుండా కట్టడి చేయగలిగారు. అయితే పేసర్ అర్ష్‌దీప్ మాత్రం ఎలాంటి ప్రభావమూ చూపలేదు. అలాగే గాయం తర్వాత ఆడిన స్పిన్నర్ చాహల్ సైతం ధారాళంగా పరుగులిచ్చుకున్నాడు. ఏదేమైనా ఈ ఆఖరి పోరులో తమ లోపాలను సరి చేసుకుంటూ ఆర్‌సీబీపై ప్రతీకారం తీర్చుకోవాలన్న కసితో పంజాబ్ ఉంది.



జోరు సాగాలని..

ఆర్‌సీబీ ప్రధాన ఆకర్షణ విరాట్ కోహ్లి అనడంలో సందేహం లేదు. ఎప్పటి మాదిరే ఈ సీజన్‌లోనూ తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో రాణిస్తున్నాడు. 614 పరుగులతో టాప్-5లో కొనసాగుతున్నాడు. ఫిల్ సాల్ట్‌తో కలిసి ఓపెనర్‌గా మెరుపు ఆరంభాలతో మిడిలార్డర్‌పై ఒత్తిడి పడకుండా చూసుకుంటున్నాడు. ఇక ఈ స్టేడియంలోనూ, పంజాబ్‌పై అతడికి మెరుగైన రికార్డు ఉండడం జట్టుకు లాభించేదే. అలాగే మయాంక్ అగర్వాల్, జితేశ్ శర్మ రాణిస్తుండడం సానుకూలాంశం. అయితే కెప్టెన్ రజత్ పటీదార్ మాత్రం ఇటీవలి మ్యాచ్‌ల్లో నిరాశపర్చాడు. గత రెండు మ్యాచ్‌లకు దూరమైన ఫినిషర్ టిమ్ డేవిడ్ ఫిట్‌నె‌స్‌పై స్పష్టత రావాల్సి ఉంది. బౌలింగ్‌లో పేసర్ హాజెల్‌వుడ్ ఇప్పటికే 21 వికెట్లతో జట్టు విజయాల్లో పాలుపంచుకుంటున్నాడు. ఇతర పేసర్లు యష్ దయాల్, తుషార, భువనేశ్వర్ సైతం ప్రభావం చూపుతున్నారు. అందుకే అన్ని విభాగాల్లోనూ పటిష్టంగా కనిపిస్తున్న ఆర్‌సీబీ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే చాంపియన్ కావడం సాధ్యమే..

తుది జట్లు (అంచనా)

బెంగళూరు: సాల్ట్, విరాట్, మయాంక్, రజత్ పటీదార్ (కెప్టెన్), లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, షెఫర్డ్, క్రునాల్, భువనేశ్వర్, యష్ దయాల్, హాజెల్‌వుడ్.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శ్రేయాస్ (కెప్టెన్), నేహల్, శశాంక్, స్టొయినిస్, ఒమర్జాయ్, జేమిసన్, అర్ష్‌దీప్, చాహల్.

పిచ్

అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. క్వాలిఫయర్2లో ఇరు జట్లూ 200+ స్కోర్లు సాధించాయి. ఇక్కడ మొదట బ్యాటింగ్‌కు దిగిన జట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నా.. చివరి మ్యాచ్‌లో పంజాబ్ అద్భుతంగా ఛేదించింది. దీంతో ఫైనల్లో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపవచ్చు.

వర్షం పడి రద్దయితే..?

ఫైనల్‌కు కూడా వర్షంతో ముప్పు పొంచి ఉంది. మంగళవారం రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉండనుందట. అహ్మదాబాద్, సమీప ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు ఆస్కారముందని వాతావరణ శాఖ తెలిపింది. ఒకవేళ వర్షంతో మ్యాచ్ రద్దయినా ఎలాంటి ఇబ్బందీ లేదు. ఫైనల్‌కు రిజర్వ్ డే ఉన్నందున బుధవారం జరుగుతుంది. అప్పుడు కూడా వర్షంతో వీలు కాకపోతే లీగ్ దశలో టేబుల్ టాపర్ (పంజాబ్) జట్టును విజేతగా ప్రకటిస్తారు.

తటస్థ వేదికగా కొలంబో

ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్

దుబాయ్: హైబ్రిడ్ ఫార్మాట్‌లో జరిగే మహిళల వన్డే వరల్డ్‌కప్ వేదికలను ఐసీసీ ఆదివారం ప్రకటించింది. టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇస్తుండగా.. తటస్థ వేదికగా శ్రీలంకలోని కొలంబోను ఎంపిక చేశారు. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా కుదిరిన ఒప్పందం ప్రకారం భారత్ నిర్వహించే ఐసీసీ ఈవెంట్లలో కూడా తమ మ్యాచ్‌లను తటస్థ వేదికపైనే ఆడే విధంగా పాక్ షరతు విధించింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2వ తేదీ వరకు జరిగే వరల్డ్‌కప్ కోసం బెంగళూరు, గువాహటి, ఇండోర్, విశాఖపట్నంతోపాటు కొలంబోను వేదికలుగా ఐసీసీ ఎంపిక చేసింది. సెప్టెంబరు 30న ఆరంభ మ్యాచ్‌లో భారత్ ఆడనుంది. అయితే, ప్రత్యర్థి ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. అక్టోబరు 29న తొలి సెమీస్‌కు గువాహటి లేదా కొలంబో, 30న జరిగే రెండో సెమీస్ బెంగళూరు వేదిక నిర్ణయించారు. నవంబరు 2న జరిగే ఫైనల్ ఫైట్‌కు బెంగళూరు లేదా కొలంబోలో నిర్వహించనున్నారు. భారత్‌తోపాటు డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు ఆడనున్నాయి.

ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ వాయిదా..

మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌ను వాయిదా వేసినట్టు ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) తెలిపింది. వాస్తవంగా ఈ నెల 6 నుంచి శ్రీలంకలో టోర్నీ జరగాల్సి ఉంది. అయితే, వాతావరణంలో తీవ్ర మార్పులతోపాటు లంక ప్రజల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో లంక బోర్డు రాసిన లేఖ ఆధారంగా టోర్నీని వాయిదా వేస్తూ ఏసీసీ నిర్ణయం తీసుకొంది. త్వరలోనే కొత్త షెడ్యూల్‌ను ప్రకటిస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, ఇండో-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సెప్టెంబరులో జరగాల్సిన పురుషుల ఆసియా కప్ టీ20 టోర్నీ కూడా రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం.

శ్రేయాస్, హార్దిక్‌కు భారీ జరిమానా

అహ్మదాబాద్: క్వాలిఫయర్-2లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్-ముంబై కెప్టెన్లపై భారీ జరిమానా విధించారు. ఈ సీజన్‌లో రెండోసారి స్లో ఓవర్ రేట్‌కు పాల్పడినందుకు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌పై రూ.24 లక్షల జరిమానా విధించగా.. మిగిలిన పంజాబ్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో రూ.6 లక్షల కోత విధించారు. ఇక ముంబై జట్టు మూడోసారి స్లోఓవర్ రేట్‌కు పాల్పడడంతో కెప్టెన్ హార్దిక్‌పై ఏకంగా రూ.30 లక్షలు, ఆటగాళ్లపై రూ.12 లక్షల జరిమానా పడింది.

ప్రతీకారం తీర్చుకున్నాడు..

కార్ల్‌సన్‌కు గుకేష్ షాక్

'క్లాసికల్'లో నార్వే దిగ్గజంపై భారత జీఎంకు తొలి విజయం





తప్పు చేసి.. సారీ చెప్పి..

స్టావంజర్ (నార్వే): ప్రపంచ చాంపియన్ గుకేష్..వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్‌పై ప్రతీకారం తీర్చుకున్నాడు. నార్వే చెస్ టోర్నీ ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌కు షాకిచ్చాడు. తద్వారా క్లాసికల్ గేమ్‌లో..సమకాలీన చెస్ దిగ్గజం కార్ల్‌సన్‌పై గుకేష్ తొలిసారి విజయం సాధించాడు. గుకేష్ చేతిలో ఓడిపోయాననే అసహనంతో బోర్డుపై కార్ల్‌సన్ ప్రతాపం చూపాడు. ఆదివారం రాత్రి జరిగిన ఆరో గేమ్‌లో తెల్లపావులతో తలపడిన 19 ఏళ్ల గుకేష్ 62 సుదీర్ఘ ఎత్తుల అనంతరం కార్ల్‌సన్‌కు చెక్ పెట్టాడు. నల్లపావులతో ఆడినా మ్యాచ్‌లో సింహభాగం కార్ల్‌సనే ఆధిక్యం ప్రదర్శించాడు. అయితే సరైన ఎత్తులతో ప్రత్యర్థిని ఎదుర్కొన్న గుకేష్ గేమ్ సుదీర్ఘంగా కొనసాగేలా చేశాడు. ఈక్రమంలో కార్ల్‌సన్ చేసిన తప్పిదాన్ని సద్వినియోగం చేసుకున్న భారత జీఎం ప్రత్యర్థిపై సంచలన విజయం అందుకున్నాడు. టోర్నమెంట్ తొలి రౌండ్‌లో మాగ్నస్ చేతిలో చవిచూసిన ఓటమికి గుకేష్ బదులు తీర్చుకున్నాడు. ఆరో రౌండ్ గెలుపుతో మొత్తం 8.5 పాయింట్లతో గుకేష్ మూడో స్థానానికి దూసుకొచ్చాడు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి అర్మగడాన్ టైబ్రేకర్‌లో చైనా జీఎం వీ ఈపై నెగ్గాడు. దాంతో మొత్తం 7.5 పాయింట్లతో హికారు నకమురాతో కలిసి అర్జున్ నాలుగో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో గ్రాండ్ మాస్టర్ వైశాలీ చేతిలో టైబ్రేకర్‌లో కోనేరు హంపి పరాజయం చవిచూసింది. అయితే మొత్తం 9.5 పాయింట్లతో ముజిచుక్‌తో కలిసి హంపి అగ్ర స్థానంలోనే కొనసాగుతోంది.

గుకేష్ చేతిలో ఓటమితో కార్ల్‌సన్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. ఈక్రమంలో అతడు టేబుల్‌పై బలంగా బాదాడు. దాంతో బోర్డుపై ఉన్న పావులు చెల్లాచెదురయ్యాయి. ఆపై గుకేష్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి సారీ చెప్పిన కార్ల్‌సన్ సీటులోంచి లేచాడు. తప్పు తెలుసుకొని తిరిగి వచ్చి టేబుల్‌పై చెల్లాచెదురైన పావులను సర్దాడు. మరోవైపు కార్ల్‌సన్‌పై విజయాన్ని జీర్ణించుకొనేందుకు గుకేష్‌కు కొంత సమయం పట్టింది. ఈక్రమంలో కార్ల్‌సన్ రూమ్ నుంచి వెళుతూ గుకేష్‌కు మరోసారి సారీ చెప్పి వెన్ను తట్టడం అందర్నీ ఆకర్షించింది.

ప్రధాని అభినందన

గుకేష్‌ను ప్రధాని మోదీ ప్రశంసించారు. 'చెస్‌లో అత్యుత్తమ ఆటగాడిపై విజయం సాధించినందుకు అభినందన. నార్వే చెస్ ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌పై గెలుపొందడం గుకేష్ అద్భుత నైపుణ్యాలకు అతడి అంకితభావానికి అద్దం పడుతుంది' అని ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మెరుపు వీరుడి వీడ్కోలు

వన్డేలకు మ్యాక్స్‌వెల్ గుడ్ బై

టీ20లలో కొనసాగుతానని ప్రకటన



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. వచ్చే ఏడాది శ్రీలంకలో జరిగే టీ20 వరల్డ్ కప్‌పై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సోమవారం వెల్లడించాడు. వన్డేలు ఆడేందుకు తన శరీరం సహకరించడంలేదని, అయినా ఈ ఫార్మాట్‌లో తాను కొనసాగితే స్వార్థపరుడినే అవుతానని చెప్పుకొచ్చాడు. మెరుపు బ్యాటింగ్‌కు మారుపేరైన 36 ఏళ్ల మ్యాక్స్‌వెల్ ఆస్ట్రేలియాకు 149 వన్డేలలో ప్రాతినిధ్యం వహించాడు. ఇక..భారత్ ఆతిథ్యమిచ్చిన 2023 వన్డే ప్రపంచ కప్‌లో అఫ్ఘానిస్థాన్‌పై వాంఖడే స్టేడియంలో మ్యాక్సీ ఆడిన ఇన్నింగ్స్ 50 ఓవర్ల ఫార్మాట్‌లో గొప్ప వాటిలో ఒకటిగా నిలుస్తుంది. 292 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆసీస్ జట్టు 91/7 స్కోరుతో ఓటమి అంచున నిలిచింది. అలాంటి పరిస్థితులలో అత్యంత ఒత్తిడిని అధిగమిస్తూ, అదిరే ఎండలో ఒంట్లోని శక్తంతా హరించుకుపోయి బ్యాటింగ్ చేయడమే కష్టమైన దశలో కేవలం 128 బంతుల్లో ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లు దంచుతూ 201 పరుగులు చేసి జట్టును విజయపథాన నిలిపాడు. ఈ ఇన్నింగ్స్‌ను వన్డే చరిత్రలో నభూతోగా పండితులు అభివర్ణించారు. ఆ విజయం ఇచ్చిన స్ఫూర్తితో ఆపై ఆస్ట్రేలియా జట్టు వన్డే వరల్డ్ కప్ విజేతగా నిలిచింది. వన్డేలలో మ్యాక్స్‌వెల్ 126 సగటు వెస్టిండీస్ బ్యాటర్ ఆండ్రీ రస్సెల్ తర్వాత రెండో అత్యధికం కావడం విశేషం.

మ్యాక్స్‌వెల్ వన్డే కెరీర్ ఇలా..: మ్యాచ్‌లు-149; పరుగులు-3990; అత్యధిక స్కోరు-201 నాటౌట్; సెంచరీలు-4; హాఫ్ సెంచరీలు-23

అంతర్జాతీయ క్రికెట్‌కు క్లాసెన్ గుడ్‌బై



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా వికెట్ కీపర్-బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ (33) అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గతేడాది జనవరిలోనే టెస్టులకు గుడ్‌బై చెప్పిన క్లాసెన్.. వైట్‌బాల్ ఫార్మాట్ నుంచి తక్షణమే వైదొలుగుతున్నట్టు తెలిపాడు. ఫ్రాంచైజీ క్రికెట్ వ్యవహారాలను సమన్వయం చేసుకొనేందుకే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు చెప్పాడు. ఏడేళ్ల కెరీర్‌లో దక్షిణాఫ్రికా తరఫున 4 టెస్టులు, 60 వన్డేలు, 58 టీ20లు ఆడాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన క్లాసెన్.. వచ్చే నెలలో అమెరికాలో జరిగే మేజర్ లీగ్ క్రికెట్ ఆడనున్నాడు. 'నా కెరీర్, కుటుంబ భవిష్యత్ కోసం ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకొన్నా. కఠిన నిర్ణయమే అయినా.. ప్రశాంతంగా ఉందని క్లాసెన్ తెలిపాడు. ఏప్రిల్‌లో ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో క్లాసెన్ పేరు లేకపోవడంతోనే అతడు రిటైర్మెంట్‌పై ఊహాగానాలు చెలరేగాయి. 2018 ఫిబ్రవరిలో స్వదేశంలో భారత్‌తో సిరీస్‌లో వన్డే, టీ20లు అరంగేట్రం చేసిన క్లాసెన్.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పవర్ హిట్టర్‌గా ఎదిగాడు.

పెగులకు ఝలక్



బోయిస్సన్

● క్వార్టర్స్‌కు గాఫ్, జొకో, జ్వెరెవ్ ● ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో అన్‌సీడెడ్ లోయిస్ బోయిస్సన్ సంచలనం సృష్టించింది. మూడో సీడ్ జెస్సికా పెగులను ఓడించిన బోయిస్సన్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. రెండో సీడ్ కోకో గాఫ్, నొవాక్ జొకోవిచ్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, మిర్రా ఆంద్రీవ కూడా రౌండ్-8లోకి అడుగుపెట్టారు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 21 ఏళ్ల లోయిస్ బోయిస్సన్ (ఫ్రాన్స్) 3-6, 6-4, 6-4తో పెగుల (అమెరికా)కు షాకిచ్చింది. రెండో సీడ్ గాఫ్ 6-0, 7-5తో అలెగ్జాండ్రోవాపై, ఆంద్రీవ 6-3, 7-5తో డారియా కసట్‌కినా (ఆస్ట్రేలియా)పై, ఏడో సీడ్ మాడిసన్ కీస్ 6-3, 7-5తో హేలీ బాప్టిస్ట్‌పై గెలిచి ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) 6-2, 6-3, 6-2తో కామెరూన్ నోరి (బ్రిటన్)పై వరుసగా సెట్లలో నెగ్గాడు. కాగా, జ్వెరెక్‌కు వాకోవర్ లభించింది. టాలన్ గ్రీక్‌స్పూర్‌తో పోరులో 6-4, 3-0తో జ్వెరెవ్ (జర్మనీ) ఆధిక్యంలో ఉన్నప్పుడు.. ప్రత్యర్థి గాయంతో తప్పుకొన్నాడు.

కేసుల సత్వర పరిష్కారంతోనే న్యాయ వ్యవస్థపై విశ్వాసం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్
- వర్చువల్ విధానంలో నిడమనూరు కోర్టు భవనం ప్రారంభం

నిడమనూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారంతోనే న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఏర్పడుతుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. ఇందుకు న్యాయాధికారులు, న్యాయవాదులు దోహదం చేయాలని కోరారు. నల్లగొండ జిల్లా నిడమనూరులో రూ.5.50కోట్ల నిధులతో నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన సముదాయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాధారాణి, జస్టిస్ సుధ, జస్టిస్ సుజన, జస్టిస్ వినోద్‌కుమార్‌ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేసినప్పుడే న్యాయ వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం ఏర్పడుతుందన్నారు. జనాభా పెరుగుతుండటంతో కేసులు కూడా పెరుగుతున్నాయని, దానికి అనుగుణంగా కోర్టుల ఏర్పాటు కూడా పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎక్కువ వాయిదాలు తీసుకోకుండా కేసులను త్వరితగతిన ముగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కక్షిదారులకు అందుబాటులో ఉంటూ సత్వర న్యాయం అందించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. హైకోర్టు పోర్టు పోలియో న్యాయమూర్తి వినోద్‌కుమార్ మాట్లాడుతూ నిడమనూరు కోర్టు పరిధిలో కేసులు ఎక్కువగా ఉన్నందున అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు సంపూర్ణ ఆనంద్, వేణు, నిడమనూరు కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి పవన్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉన్నం చినవీరయ్య పాల్గొన్నారు..

తెలంగాణ ఉజ్వల ప్రయాణంలో ఎన్నారైలది కీలకపాత్ర

ఎన్నారై అంటే.. 'నెసెసరీ రెసిడెంట్ ఆఫ్ ఇండియా'

- పొజిషన్‌లో ఉన్నా, అపోజిషన్‌లో ఉన్నా మాకు తెలంగాణే ఫస్ట్
- ఓట్లలో వెనకబడ్డామేమో కానీ, తెలంగాణను ప్రేమించడంలో కాదు
- డల్లాస్‌లో తెలంగాణ ఆవిర్భావ, బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాల్లో
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు



హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసీయుల పాత్ర ఎనలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, పదేళ్ల ఉజ్వల ప్రయాణంలో ఎన్నారైల పాత్ర అద్వితీయమని కొనియాడారు. 'ఎన్నారై అంటే నాన్ రెసిడెంట్ ఇండియన్ కాదు.. నెసెసరీ రెసిడెంట్ ఆఫ్ ఇండియా' అని చెప్పారు. తెలంగాణ చరిత్రలో ఎన్నారైల పాత్ర ఎప్పటికీ సువర్ణాక్షరాలతో లిఖించి ఉంటుందన్నారు. అమెరికాలో నివసిస్తున్న ఆడబిడ్డలు ఏనాడూ బతుకమ్మను మర్చిపోలేదని, బతుకునిచ్చిన తెలంగాణ తల్లిని కూడా మర్చిపోలేదని అభినందించారు. అమెరికాలోని డల్లాస్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకలు, బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాల్లో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'జననీ జన్మభూమిశ్చ.. స్వర్గాదపీ గరీయసీ' అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన కేటీఆర్.. కర్మభూమి మీద కార్యదక్షులై వర్ధిల్లాలని, అదే సమయంలో జన్మభూమి రుణం కూడా తీర్చుకోవాలని ఎన్నారైలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. 14 ఏళ్ల అలుపెరగని పోరాటంతో సాధించిన తెలంగాణ రాష్ట్రం, కేసీఆర్ పాలనలో కేవలం పదేళ్లలోనే దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఎదిగిందని గుర్తుచేశారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. తెలంగాణను అద్భుత అవకాశాల అక్షయపాత్రగా, దేశానికే ఆర్థిక చోదక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్‌దేనని చెప్పారు. ట్రంప్ విధానాలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అమెరికాలో లీగల్ సెల్ ఏర్పాటు విద్యార్థులను ఆదుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు బరువులా కాకుండా బాధ్యతగా, ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వాన్ని నడిపామని చెప్పారు. 2023లో జరిగిన ఎన్నికల్లో ఓట్ల పరంగా వెనకపడి ఉండొచ్చు కానీ, తెలంగాణను ప్రేమించడంలో ఎన్నటికీ వెనకబడమని తెలిపారు. 'పొజిషన్‌లో ఉన్నా, అపోజిషన్‌లో ఉన్నా కచ్చితంగా మాకు తెలంగాణ ఫస్ట్, ఇండియానే ఫస్ట్' అని కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ బిడ్డలు బతుకుతెరువు కోసం వలస వెళ్లేవారని.. ఇప్పుడు ఇతర రాష్ట్రాల కూలీలు వచ్చి తెలంగాణ పొలాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రపంచమే ఆశ్చర్యపోయేలా టీఎస్‌ఐపాస్ విధానాన్ని రూపొందించామని, దాంతో 27 వేలకు పైగా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని వివరించారు. దేశంలోనే జిల్లాకో మెడికల్, నర్సింగ్ కళాశాల ఉన్న ఒకే ఒక్క రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దినట్లు కేటీఆర్ వెల్లడించారు.

మెడికల్ వీసాపై వచ్చి డ్రగ్స్ దందా

- నైజీరియా నుంచి నేరుగా గోవాకు
- 12 ఏళ్లుగా పేర్లు మార్చి రాకపోకలు
- నైజీరియన్‌ను అరెస్టు చేసిన టీజీ న్యాబ్
- రూ.1.25 కోట్ల మత్తుపదార్థాల స్వాధీనం

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్లుగా వేర్వేరు పేర్లతో మెడికల్ వీసాపై నైజీరియా నుంచి నేరుగా గోవాలో దిగి.. డ్రగ్స్ దందా చేస్తున్న ఘరానా పెడ్లర్‌ను తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) అరెస్టు చేసింది. నైజీరియాకు చెందిన ఇమాన్యుయేల్ బెడియాకో అలియాస్ మాక్స్‌వెల్ అలియాస్ మాక్స్ అనే వ్యక్తి.. రూ.కోట్లలో డ్రగ్స్ దందా చేసి, రూ.60 లక్షల వరకు కమీషన్ పొందినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసు వివరాలను టీజీ న్యాబ్ డీజీ సందీప్ శాండిల్య వెల్లడించారు. మ్యాక్స్ తొలుత 2013లో బెంగళూరులో చికిత్స పేరుతో భారత్‌కు వచ్చాడు. అక్కడి నుంచి గోవాకు వెళ్లి, మరో నైజీరియన్ రోమీతో కలిసి డ్రగ్స్ దందా మొదలుపెట్టాడు. ఇలా.. 2022 వరకు గోవా, హైదరాబాద్‌తోపాటు.. దేశంలోని పలు ప్రాంతాల్లో డ్రగ్స్ దందా చేశాడు. ఆ తర్వాత మళ్లీ నైజీరియాకు వెళ్లి.. 2023 తర్వాత రెండుసార్లు మారు పేర్లతో మెడికల్ వీసాపై వచ్చాడు. గోవాలోని రోమీతో కలిసి డ్రగ్స్ దందాను కొనసాగించాడు. హైదరాబాద్‌లో ఇతని కదలికలపై ఉప్పందుకున్న టీజీ న్యాబ్ పోలీసులు.. పక్కా వ్యూహంతో అరెస్టు చేశారు. ఇతని నుంచి రూ.1.25 కోట్లు విలువ చేసే 550 గ్రాముల కొకైన్, 11 వందల ఎక్టసీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై రెడ్‌కార్నర్ నోటీసును జారీ చేసి, నైజీరియాకు డీపోర్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సందీప్ శాండిల్య వివరించారు.

వైమానిక రంగంలో అద్భుత అవకాశాలు

విదేశీ సంస్థలు పెట్టుబడులతో రావాలి
విమానాల తయారీ కేంద్రంగా భారత్
ఐఏటీఏ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత వైమానిక రంగం పెట్టుబడులకు అద్భుత అవకాశాల గని అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. 2030 నాటికి భారత విమానాల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల (ఎంఆర్‌ఓ) రంగం 400 కోట్ల డాలర్ల స్థాయికి చేరనుందన్నారు. భారత్‌ను విమానాల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భారత్‌ను ఒక మార్కెట్‌గా కాకుండా.. వాల్యూ చెయిన్ లీడర్‌గా చూడాలని కోరారు. దేశీయ విమానయానపరంగా చూస్తే ప్రస్తుతం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఎదిగిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమానయానాన్ని దగ్గర చేసేందుకు తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉడాన్ పథకం భారత విమానయాన చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు.

మరో 50 ఎయిర్‌పోర్టులు

వచ్చే ఐదేళ్లలో దేశంలో కొత్తగా మరో 50 విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్టు ఇదే సదస్సులో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 164కు చేరిందన్నారు. ఉడాన్ పథకంతో దేశంలో విమానయానం ప్రజాస్వామీకరించబడి 619 మార్గాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విమానాల నిర్వహణ మరమ్మత్తులకూ భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించారు.

విమాన సంస్థల లాభాలు రూ.3 లక్షల కోట్లు

కొన్ని సమస్యలు, సవాళ్లు ఉన్నా ఈ సంవత్సరం అంతర్జాతీయ విమానయాన సంస్థలు 97,900 కోట్ల డాలర్ల (సుమారు రూ.83.59 లక్షల కోట్లు) ఆదాయంపై 3,600 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.07 లక్షల కోట్లు) లాభాలు ఆర్జించే అవకాశం ఉందని ఐఏటీఏ అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది 360 కోట్ల డాలర్లు ఎక్కువని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ ప్రకటించారు. ప్రస్తుతం విమానయాన రంగం ప్రపంచ జీడీపీలో 3.9 శాతం వాటా కలిగి ఉందన్నారు. భారత విమానయాన రంగం జీడీపీకి 560 కోట్ల డాలర్లు (సుమారు రూ.47,818 కోట్లు) సమకూరుస్తూ నేరుగా 3,69,700 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోందన్నారు. ఖర్చులు, పన్నుల భారం పెరుగుతున్నా పదేళ్ల క్రితంతో పోలిస్తే విమానయాన సంస్థల వాస్తవ ఖర్చులు 40 శాతం వరకు తగ్గాయని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ అన్నారు. పరోక్షంగా విమానయాన రంగంతో ముడిపడి ఉన్న పర్యాటక రంగాన్ని కూడా కలుపుకుంటే భారత విమానయాన రంగం 77 లక్షల మందికి ఉపాధి, జీడీపీకి 1.5 శాతం సమకూరుస్తోందన్నారు.

ప్లాంట్ పెట్టేందుకు రెడీ: ఎంబ్రాయర్

భారత్‌లో పూర్తి స్థాయి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయర్ విమానాల తయారీ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. కాకపోతే ఇందుకు భారత విమానయాన సంస్థల నుంచి కనీసం 200 విమానాల ఆర్డర్ అవసరమని కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ ఫ్రాన్సిస్కో గొమెస్ నెటో స్పష్టం చేశారు. ఐఏటీఏ సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. తమ విమానాలు అమ్మేందుకు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు నెటో వెల్లడించారు.

ప్రపంచంలో అత్యంత విలువైన టెక్ దిగ్గజాల్లో రిలయన్స్

రూ.18.45 లక్షల కోట్ల మార్కెట్ విలువతో 23వ స్థానంలో అంబానీ కంపెనీ

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు మరో గౌరవం దక్కింది. ప్రపంచంలోని 30 అత్యంత విలువైన లిస్టెడ్ టెక్ దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్‌కూ చోటు లభించింది. ఈ లిస్ట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక భారత కంపెనీ ఇదే. 'ట్రెండ్స్- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' పేరుతో సోమవారం విడుదలైన రిపోర్టు ప్రకారం.. 21,600 కోట్ల డాలర్ల (రూ.18.45 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో రిలయన్స్ 23వ స్థానంలో నిలిచింది. కాగా, అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్స్, టెస్లా, బ్రాడ్‌కామ్ వరుసగా తొలి 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ 9వ స్థానంలో ఉంది. చైనా కంపెనీ టెన్సెంట్ 10వ స్థానంలో ఉంది.

ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 22 శాతం వృద్ధి లక్ష్యం: ఎన్ఎండీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ ఈ ఏడాది ఇనుప ఖనిజం ఉత్పత్తిని 22% మేరకు పెంచి 5.5 కోట్ల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి 10 కోట్ల టన్నులకు ఉత్పత్తిని విస్తరించాలన్న బృహత్ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించింది. ఏప్రిల్, మే నెలల్లో 45% వృద్ధితో 84.3 లక్షల టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి చేసినట్టు తెలిపింది.

అదానీ గ్రూప్‌పై అమెరికా దర్యాప్తు!

గుట్టుగా ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి

తోసిపుచ్చిన అదానీ గ్రూప్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్ మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. గుజరాత్‌లోని తన ముంద్రా రేవు ద్వారా కొన్ని కంపెనీలు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి చేసుకునేందుకు సహకరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై అమెరికా దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ప్రారంభించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనం ప్రచురించింది. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇరాన్ నౌకలు ఏవీ కూడా ఎల్‌పీజీతో తమ రేవులకు రాలేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తమపై అమెరికా సంస్థలు దర్యాప్తు జరుపుతున్న విషయం కూడా తమకు తెలియదని తెలిపింది. కొన్నిసంస్థలు దురుద్దేశాలతో తమపై కావాలనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ప్రచారం చేస్తున్నాయని అదానీ గ్రూప్ తెలిపింది. 'మా రేవుల ద్వారా ఇరాన్ నుంచి వచ్చే ఎలాంటి సరుకుల ఎగుమతి, దిగుమతులను అనుమతించడం లేదు. అది మా విధానపరమైన నిర్ణయం. ఇరాన్ జెండాతో వచ్చే నౌకలు లేదా నేరుగా ఇరాన్ రేవుల నుంచి వచ్చే నౌకలు అన్నిటికీ ఇది వర్తిస్తుంది' అని తెలిపింది.

ఈ విడత 0.50% వడ్డీకోత: ఎస్‌బీఐ

దేశంలో రుణ విభాగాన్ని ఉత్తేజితం చేయడంతో పాటు పలు రకాల అస్థిరతలను దీటుగా ఎదుర్కొనగల శక్తి కల్పించడం కోసం రిజర్వ్ బ్యాంక్ ఈసారి అర శాతం మేరకు రెపోరేటును తగ్గించవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. బుధవారం ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు ప్రారంభమవుతాయి. శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను ప్రకటించనున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,640 ▲	89,500 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	99,820 ▲	89,500 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,00,300 ▲
ప్రొద్దుటూరు	96,250 ▲	88,550 ▲	98,600 ▲
ముంబై	96,680 ▲	88,559 ▲	97,761 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ

హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	112
కరీంనగర్	107	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	97
కర్నూలు	107	నెల్లూరు	102
విశాఖపట్నం	101	అనంతపురం	102
గోదావరి	109		

విదేశీ కంపెనీలు ఉత్పత్తికి సై అంటే దిగుమతి సుంకం 15 శాతమే..

8,000 ఈవీలకు మాత్రమే అనుమతి

దేశీయ తయారీపై కనీస పెట్టుబడి రూ.4,150 కోట్లు ఉండాలి

కొత్త ఈవీ పాలసీ మార్గదర్శకాలు విడుదల

న్యూఢిల్లీ: దేశీయంగా విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీకి ముందుకు వచ్చే విదేశీ కంపెనీలకు దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈవీల స్థానిక తయారీని పటిష్ఠం చేయడం, ప్రపంచ పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం లక్ష్యంగా రూపొందించిన కొత్త ఈవీ విధానం మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది. దీంతో ఈ పాలసీ ఇప్పుడు అమలులోకి వచ్చినట్టవుతుంది. దాని ప్రకారం ఈవీల తయారీలో కనీసం రూ.4,150 కోట్ల పెట్టుబడులు పెట్టే ఆటో తయారీదారులను 15% తగ్గింపు సుంకంపై 8,000 ఈవీలు దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. అయితే అనుమతులు పొందిన తేదీ నుంచి మూడు సంవత్సరాల్లోగా ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు తయారీలో ఎంత శాతంలో స్థానిక ఉత్పత్తులు వినియోగించేది ప్రకటించాల్సి ఉంటుంది.

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా రెండు వారాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటవుతుందని, 120 రోజులు అది అందుబాటులో ఉంటుందని అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత కూడా వచ్చే ఏడాది మార్చి 15 వరకు ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు దరఖాస్తుల విభాగాన్ని తెరిచే అవకాశం ఉంది. ఈ స్కీమ్ కింద ఒక్కో దరఖాస్తుదారునిపై కోల్పోయే సుంకాల గరిష్ఠ పరిమితి రూ.6,484 కోట్లుగా ఉండనుందన్నారు.

భారత్‌లో తయారీపై టెస్లా అనాసక్తి

ప్రపంచ ఆటోమొబైల్ కంపెనీలు మెర్సిడెస్ బెంజ్, స్కోడా-ఫోక్స్‌వేగన్, హ్యుండయ్, కియా దేశంలో విద్యుత్ కార్ల తయారీపై ఆసక్తిని ప్రకటించాయని ఈ పాలసీ మార్గదర్శకాల విడుదల సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. అయితే ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా మాత్రం దేశీయ తయారీ పట్ల ఆసక్తిగా లేదని, దేశంలో తమ షోరూమ్‌లు ప్రారంభించేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నదని ఆయన చెప్పారు.

మార్కెట్లో మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు

» సెన్సెక్స్ 77 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లను మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు అలుముకున్నాయి. స్టీల్, అల్యూమినియంపై సుంకాలను రెట్టింపు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఈ మధ్యనే కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ అమెరికా-చైనా పరస్పర ఆరోపణలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌కు గండికొట్టాయి. దాంతో సోమవారం సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 796.75 పాయింట్లు క్షీణించి 80,654 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ చివరికి 77.26 పాయింట్ల నష్టంతో 81,373.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ప్రారంభంలో 224.55 పాయింట్ల వరకు కోల్పోయినప్పటికీ, చివరికి 34.10 పాయింట్ల నష్టంతో 24,716.60 వద్ద స్థిరపడింది. గత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా 6.5 శాతంగా నమోదవడంతో పాటు జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండో నెలా రూ.2 లక్షల కోట్లు దాటడం, ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును అర శాతం వరకు తగ్గించవచ్చన్న అంచనాలు సూచీల రికవరీకి తోడ్పడ్డాయి.

మీనాక్షి ఆల్టర్నేట్స్ రియల్టీ ఫోకస్డ్ ఫండ్

700 కోట్ల కార్పస్‌తో ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన రియల్టీ, శుద్ధ ఇంధన వ్యాపారాల నిర్వహణలోని మీనాక్షి గ్రూప్ తాజాగా ఆర్థిక సేవల రంగంలోకి ప్రవేశించింది. మీనాక్షి ఆల్టర్నేట్స్ (ఎం-ఆల్ట్స్) పేరుతో ఆర్థిక సేవల అనుబంధ విభాగంతో పాటు దాని పరిధిలో తొలి ఫండ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు మీనాక్షి గ్రూప్ వెల్లడించింది.

'మీనాక్షి రియల్ అసెట్స్ ఫండ్' పేరుతో రూ.700 కోట్ల కార్పస్‌తో ఈ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సెబీ అనుమతితో కూడిన కేటగిరీ-2 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) ఇది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడుదలకు సిద్ధమైన ఘాటీ



అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఘాటీ'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. తాజాగా, ఈ సినిమాను జూలై 11న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమాలోని ప్రధాన పాత్రధారులు సంచులు మోసుకుంటూ నదిని దాటుతున్న విజువల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: చాణక్యరెడ్డి తూరుపు, వెంకట్ ఎన్.స్వామి, సినిమాటోగ్రఫీ:మనోజ్‌రెడ్డి కాటసాని, సంగీతం:నాగవెల్లి విద్యాసాగర్. కాగా, 'వేదం' తర్వాత క్రిష్, అనుష్క కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ధనుష్ నటనకు జాతీయ అవార్డు వస్తుంది



శేఖర్ కమ్ముల



నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా, చెన్నైలో ఆడియో వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన చిత్రం. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది. నాగార్జున, ధనుష్‌ల నటన నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ధనుష్ ఆల్‌రౌండర్. ఈ చిత్రంలో ఆయన నటనకు జాతీయ అవార్డు వస్తుంది" అని అన్నారు. "సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. శేఖర్ కమ్ముల అద్భుతంగా సినిమాను తెరకెక్కించారు. రజనీకాంత్‌తో నేను నటించిన 'కూలీ' సినిమా మీ అందరి ఊహలకు మించి ఉండబోతోంది" అని నాగార్జున చెప్పారు. "శేఖర్ కమ్ముల స్వచ్ఛమైన మనసు ఉన్న వ్యక్తి. ఇందులో చేసిన పాత్ర నాకెంతో ప్రత్యేకం" అని ధనుష్ తెలిపారు.

ఎంత దుష్ప్రచారం చేస్తారో చేస్కోండి

తనపై వస్తున్న దుష్ప్రచారాలపై ధనుష్ ఈ సందర్భంగా స్పందించారు. "నేనెప్పుడూ నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నిస్తుంటాను. నాపై, నా సినిమాలపై ఎంతగా దుష్ప్రచారం చేస్తారో చేసుకోండి. నా సినిమాల విడుదలకు ముందు ప్రతిసారి ఏదో ఒక విషయంలో కుట్రలు పన్నుతూనే ఉంటారు. అయినా ఆ ప్రయత్నాలు నన్నేమీ చేయలేవు. నా అభిమానులు 23 ఏళ్లుగా నా వెన్నంటే ఉన్నారు. ఇలాంటి సర్కస్‌లు చేయడం మానుకోండి. ఎవరెంత దుష్ప్రచారం చేసినా అభిమానులు నాతోనే ఉంటారు" అని పేర్కొన్నారు.

ఫిల్మ్ చాంబర్‌లో 'వీరమల్లు' నిర్మాత



సినిమా టికెట్ ధరల పెంపు లేదా ఏ ఇతర విషయాలకు సంబంధించి అయినా సినీ పరిశ్రమకు చెందిన వారితో వ్యక్తిగత చర్చలకు తావులేదని ఇటీవలె ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పవన్ సూచన మేరకు 'హరి హర వీరమల్లు' చిత్ర నిర్మాత ఏ.ఎం.రత్నం తాజాగా ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్‌ను కలిశారు. తమ చిత్రానికి సంబంధించి అదనపు షోలకు అనుమతి, టికెట్ ధరల సవరణ కోరుతూ లేఖను అందజేశారు. 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెల 12న విడుదల కానుంది.

మనసును తాకేలా



సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. దీపావళి సందర్భంగా అక్టోబర్ 17 సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఊహించని మలుపులతో నిండిన ఈ సినిమా ప్రేక్షకుల మనసును తాకేలా ఉంటుందని తెలిపారు.

థగ్‌లైఫ్‌ను అడ్డుకుంటాం



కన్నడ భాష గురించి నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలతో థగ్‌లైఫ్ సినిమాను కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నెల 5న సినిమాను కర్నాటకలో విడుదల చేస్తే థియేటర్లకు నిప్పు పెడతామని కర్ణాటక రక్షణ వేదిక(కరవే) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ హెచ్చరించారు. కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ మైసూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కమల్‌హాసన్ సినిమాను బహిష్కరించాల్సిందేనని అన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన కమల్ హాసన్

థగ్‌లైఫ్ సినిమాకు వస్తున్న బెదిరింపులపై కమల్ హాసన్, కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. సినిమా ప్రదర్శనకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తగిన భద్రత కల్పించేలా చూడాలని కోర్టుకు విన్నవించారు. ఇదిలా ఉంటే తమిళం నుంచి కన్నడ పుట్టిందని కమల్ హాసన్ వ్యాఖ్యానించినప్పుడు తాను చప్పట్లు కొట్టలేదని నటుడు శివరాజ్‌కుమార్ వివరణ ఇచ్చారు. అన్ని భాషలూ ముఖ్యమైనవేనని, తన మాతృభాష కన్నడకే ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని ఇంతకు ముందే చెప్పానని అన్నారు. కన్నడ కోసం తన ప్రాణమైనా ఇస్తానని అన్నారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

అంబరాన్నంటిన ఆవిర్భావ సంబరాలు



బెల్లంపల్లిలో జెండా ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే నాయకులు



నస్పూర్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



దండేపల్లిలో జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ రోహిత్



జైపూర్‌లో జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ వనజారెడ్డి, సిబ్బంది

నస్పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆవిర్భావ వేడుకలు సోమవారం నస్పూర్ పట్టణంలో ఘనంగా జరిగాయి. తహసీల్దార్ సంతోష్ కుమార్ జెండాను నస్పూర్‌లో నాయకులు జోగుల మల్లయ్య, రాజేశ్వర్‌రావు, లింగం రవి, నగేష్ జాతీయ జెండాలను ఆయా ప్రాంతాల్లో ఎగురవేశారు. తెలంగాణ తల్లి చౌరస్తా, షిర్కే కాలనీలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు జెండాలను ఆవిష్కరించారు.

బెల్లంపల్లి: పట్టణంతో పాటు మండలంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో పాఠశాలల్లో జెండా ఎగురవేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్‌తో పాటు నాయకులు జెండా ఎగుర వేసి అమరులకు నివాళులు అర్పించారు.

దండేపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలతో పాటు ఆయా పార్టీల ఆధ్వర్యంలో సోమవారం జాతీయ జెండాలను ఎగుర వేశారు. మండల ప్రత్యేకాధికారి దుర్గప్రసాద్, తహసీల్దార్ రోహిత్ దేశపాండే, సహకార సంఘం చైర్మన్లు లింగన్న, సురేష్, ఏవో అంజిత్‌కుమార్, ఎంఈవో చిన్నయ్య, ఐకేపీ ఏపీఎం బ్రహ్మయ్య, ఏఈఈ బాపు, హెచ్ఎంశ్రీనివాస్, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శోభ, లింగాపూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రమేష్, కస్తూర్బా విద్యాలయంలో ఎస్‌వో మంజులతో పాటు పార్టీ అధ్యక్షుడు వారి వారి కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు.

మంచిర్యాలక్రైం : మంచిర్యాల నగరపాలక కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ శివాజి జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్ : మండలంలో తహసీల్దార్ వనజారెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముస్తాఫా, వ్యవసాయాధికారి మార్క్ గ్లాడ్‌స్టన్, బీసీ బాలికల వసతి గృహంలో వార్డెన్ సుధాలక్ష్మీ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్ జెండాను ఆవిష్కరించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీడీవో కుమారస్వామి, తహసీల్దార్ సంధ్యారాణి, ఎస్ఐ శ్యామ్ పటేల్, ఏవో వీరన్న, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాజేష్, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. వేమనపల్లిలో మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ, నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరు పట్టణంలో, మండలంలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో మోహన్ జాతీయ జెండాను ఎగురవేశారు. పంచాయతీ కార్యదర్శులు జాతీయ పతాకం ఆవిష్కరించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్ జెండా ఆవిష్కరించారు.

తాండూర్ : మండలంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ జ్యోత్స్న, ఎస్ఐ కిరణ్‌కుమార్, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులు జాతీయ జెండాను ఎగుర వేశారు.

కాసిపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు సింగరేణి బొగ్గుబావులు, దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ, కాసిపేట దేవాపూర్ పోలీసు స్టేషన్‌లతో పాటు ఆయా రాజకీయ పార్టీలు జాతీయ జెండాను ఎగురవేశారు. మండల ప్రత్యేకాధికారి పురుషోత్తం నాయక్, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో, పాఠశాలల్లో వివిధ పార్టీల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సీఐ రమణమూర్తి, తహసీల్దార్ దిలీప్‌కుమార్, న్యాయాధికారి సాయికిరన్, ఎంపీడీవో సరోజ, సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఏవో శ్రీకాంత్, సీడీపీవో రేష్మా, ఎంఈవో శైలజ జెండాలను ఎగురవేశారు.

కోటపల్లి : కోటపల్లి మండల కేంద్రంలో ఎంపీడీవో లక్ష్మయ్య, రూరల్ సీఐ సుధాకర్, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంఈవో వెంకటేశ్వర్లు, వైద్యాధికారిణి అరుణశ్రీ, మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ రాజశేఖర్, హెచ్ఎం కృష్ణ మూర్తి, కేజీబీవీలో ప్రత్యేకాధికారిణి హరిత జెండాను ఎగురవేశారు. పోలీస్‌స్టేషన్‌లో రూరల్ సీఐ విద్యార్థులకు బహుమతులు అందించారు.

మందమర్రిటౌన్ : మందమర్రి పట్టణంలో తెలంగాణ తల్లి, అమవీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. మున్సిపల్ కమిషనర్ రాజలింగు, ఎస్ఐ రాజశేఖర్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ కార్యాలయం పార్టీ సీనియర్ నాయకుడు రాజశేఖర్ జెండా ఆవిష్కరించారు.

●పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పార్టీ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

నెన్నెల : మండలంలోని ఊరువాడ జాతీయ పతాకాలు రెపరెపలాడాయి. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ మహేంద్రనాథ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏడీఏ సురేఖ, ఎస్సై ప్రసాద్, ఎఫ్ఆర్‌వో దయాకర్ వారివారి కార్యాలయాల్లో జెండాలను ఆవిష్కరించారు. పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్, పశువైద్యశాలలో డాక్టర్ సంపత్ జెండా ఎగురవేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మండల అధ్యక్షులు గట్టు మల్లేష్, అంగళి తిరుపతి, సాగర్‌గౌడ్ జాతీయ పతాకాలను ఎగురవేశారు.

కన్నెపల్లి : మండలంలో డిప్యూటీ తహసీల్దార్ పోశయ్య, ఎంపీడీవో వంకర్, ఎస్ఐ గంగారాం, ఏవో సాయి ప్రశాంత్‌లు జాతీయ జెండా ఆవిష్కరించారు. పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, పార్టీ కార్యాలయాల్లో నాయకులు జెండా ఎగురవేశారు.

మందమర్రిరూరల్ : మండలంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఊరు మందమర్రిలో ఏఈ వేముల మౌనిక, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సారా తస్లీమ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఆర్ఐ గణపతి , ఏపీవో రజియాసుల్తానా పాల్గొన్నారు.

మంచిర్యాలకలెక్టరేట్: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేశారు. మున్నారాజా సిసోడియా, పురుషోత్తం జాజు, గోలి రాము, పట్టి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

●ప్రజలు కోరుకున్న విధంగా స్వరాష్ట్రంలో ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్ అన్నారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ జెండా ఆవిష్కరించారు.

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌రావు తెలంగాణ తల్లి చిత్రపటానికి పూల మాలలు వేశారు. కాంగ్రెస్ నాయకులు పల్లె రాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద, పట్టణ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించగా పట్టణ అధ్యక్షులు కంభగోని సుదర్శన్‌గౌడ్, మాజీ కౌన్సిలర్‌లు సూపర్ బజార్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు.

జన్నారం: తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి జెండా ఆవిష్కరించగా, మండలంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముజాఫర్ అలీతో పాటు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రాజారాం రెడ్డి, జనార్ధన్, పొన్కల్ గ్రామ పంచాయతీతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో జెండా ఆవిష్కరించారు.



కాసిపేటలో జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ బోజన్న



లక్సెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో జెండా ఎగురవేస్తున్న సీఐ రమణమూర్తి



చెన్నూరులో జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు



మంచిర్యాలలో జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

కాకాకు నివాళి



కాక వెంకటస్వామి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వంశీకృష్ణ

మందమర్రిటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్ లోని అన్ని నియోజకవర్గాల్లో సోమవారం పర్యటించారు. గోదావరిఖనిలో ఉన్న తన తాత కాకా వెంకటస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కాటారం మండలం గంగారం ఎస్సీ కాలనీ రోడ్డు ప్రమాదం జరిగి నలుగురు మృత్యువాత పడగా అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టా ట్రాఫిక్‌ను పునరుద్దరించారు.

జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ

బెల్లంపల్లి, జూన్2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో బెల్లంపల్లి సాంఘీక సంక్షేమ సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కి చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించి మంచి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌సాగర్ తెలిపారు. ఆలిండియా జే ఈ ఈ అడ్వాన్స్ పరీక్షలో ఎస్. ఆదర్శ్ 3285 ర్యాంక్, కె. రంజిత్ 3438ర్యాంక్, చరణ్ 4346 ర్యాంక్, రాజేందర్ 5414 ర్యాంక్, షేక్ సుభాన్ 32,272 ర్యాంక్‌లు సాధించినట్లు ప్రి న్సిపాల్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి, జూన్2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సోమవారం తహసీల్దార్ క్రిష్ణ అన్నారు. నేటి నుంచి ఈ నెల 20 వరకు బెల్లంపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు ఎలాంటి భూ సమస్యలు ఉన్న తమను సంప్రదించాలని పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, రిజిష్టర్ డాక్యుమెంట్లు సదస్సులకు వచ్చేటప్పుడు తీసుకరావాలని సూచించారు.

ఆలయానికి ఫ్యాన్లు అందజేత

బెల్లంపల్లి, జూన్2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో గల బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం వరంగల్‌కు చెందిన పెద్ది సంతోష్‌తోపాటు కుటుంబ సభ్యులు ఆలయానికి పది సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. భక్తుల సౌకర్యార్థం ఫ్యాన్లను అందజేసినట్లు దాతలు తెలిపారు. బాను చందర్, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమం

తాండూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి గ్రామ రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేయబడిన రెవెన్యూ గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు విత్తన కిట్‌లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి

(1వ పేజీ తరువాయి)

ఎనిమిది నెలల కాలంలో 25లక్షల పైచిలుకు మంది రైతులకు రుణ విముక్తి చేయించామన్నారు. 20వేల617 కోట్ల రూపాయల రుణమాఫీ చేశామన్నారు. జిల్లాలో రైతు రుణమాఫీ పథకం కింద 64,452 మంది రైతన్నలకు 540 కోట్ల రూపాయల రుణమాఫీ చేశామన్నారు. జిల్లాలో 2 లక్షల మందికి పైగా కార్డుదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేశామన్నారు. పారదర్శకంగా కులగణన నిర్వహించి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టి రైతులకు అనుకూలంగా అప్పీలు వ్యవస్థను రూపొందించిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందన్నారు. మంచిర్యాల పట్టణంలో ప్రజలకు అందుబాటులో రూ.10కోట్ల22లక్షలతో రాష్ట్రంలోనే అత్యుత్తమంగా మహా ప్రస్థానం నిర్మించామన్నారు. అమృత్ 2.0 పథకం కింద అన్ని మున్సిపాలిటీలకు 275 కోట్ల రూపాయలు మంజూరు చేయబడి పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. సింగరేణి నీటి బిందు జలసింధు పథకం కింద 62 కొత్త చెరువుల ఏర్పాటుతో పాటు 100 పాత చెరువలలో పూడికతీసి పునరుద్ధ రించామన్నారు. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ ఎకానమి స్టేట్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, జిల్లా అధికారులు దుర్గప్రసాద్, వెంకటేశ్వర్లు, పురుషోత్తం నాయక్, ఏవో రాజేశ్వర్, డీపీఆర్‌ఓ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం



పారుపెల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్‌నాయకులు

కోటపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి ప్రభుత్వ బడులను కాపాడుకుందామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణులు అన్నారు. సోమవారం మండలంలోని పారుపెల్లి, పిన్నారం, ఎడగట్ట, ఎసన్వాయి, సర్వాయిపేట గ్రామాల్లో పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కోసం ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు, విశాలమైన గదులు, ఆట స్థలాలు ఉన్నాయని, అలాగే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, రాగి జావ, కోడిగుడ్లు అందిస్తున్నామన్నారు. ఫీజుల భారం లేని ఉచిత విద్య పొందాలని విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలలు దోహదపడతాయన్నారు. ఈ నెల 5 వరకు ప్రతి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్, శివానంద్ పాల్గొన్నారు.

మునీర్ కుటుంబ సభ్యునిలాంటివాడు

ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సీనియర్‌జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమ నేత ఎండీ మునీర్ తన కుటుంబ సభ్యునిలాంటివాడని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. సోమవారం రాత్రి మంచిర్యాలలోని గౌతమినగర్‌లో నిర్వహించిన మునీర్ సంతాపక సభకు ఆయన హాజరయ్యారు. మునీర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రగతి శీల ప్రజాస్వామ్యాభావాలతో పేద ప్రజల హక్కుల కోసం పని చేశారన్నారు. మునీర్ లాంటి జర్నలిస్టును చూడలేదన్నారు. అనారోగ్యంతో ఉన్నప్పుడు ఆసుపత్రిలో మునీర్‌తో గంట సేపు మాట్లాడిన క్షణాలు మరువలేనివన్నారు. మందమర్రిలో మునీర్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

విత్తన స్వయం సమృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



నెన్నెలలో నాన్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

నెన్నెల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. విత్తన భద్రతలో దేశంలోని మిగతా రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచేలా పనిచేస్తున్నామన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఏర్పాటు చేసిన నాన్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరి, కంది, పెసర, మినుము, జొన్న విత్తన కిట్లను రైతులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ తమ అవసరాలు తీర్చుకునేందుకు రైతు స్థాయిలోనే నాన్యమైన విత్తనోత్పత్తి చేపట్టాలని సూచించారు. ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు వ్యవసాయ పరిశోధన స్థానాల్లో ఉత్పత్తి చేసిన విత్తన కిట్లు అందజేస్తున్నామని, వారు పండిచిన పంట నుంచి ఈ ప్రాంత రైతులు అతి తక్కువ ధరకు విత్తనాలు కొనుగోలు చేయవచ్చన్నారు. విత్త నాలు వేసినప్పటి నుంచి కోతల వరకు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇస్తూ అధిక దిగుబడులకు తోడ్పాటునందిస్తారని అన్నారు. రాబోయే మూడేళ్లలో ప్రతి గ్రామంలో విత్తన స్వయం సమృద్ధి సాధించేలా కార్యచరణ రూపొందిచామన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంతో నకిలీ విత్తనాల బెడద తీరడంతో పాటు రైతులకు అతి తక్కువ ధరకు నాన్యమైన విత్తనాలు లభ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యూ ఎస్‌ఈవీ నోడల్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, భీమిని ఏడీఏ సురేఖ, కేవీకే శాస్త్రవేత్త నాగరాజు, మండల వ్యవసాయ అధికారి పుష్పా ల సృజన, ఏఈవోలు రామ్‌చందర్, సంతోష్, మౌనిక, షైనీ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కలుషిత నీటితో కార్మికుల అవస్థలు

పట్టించుకోని అధికారులు

కాసిపేట, జూన్2 (ఆంధ్రజ్యోతి): భూగర్భ గనిలో విధులు ముగించుకొని వచ్చిన కార్మికులు స్నానాలు చేయడానికి సింగరేణి యాజమాన్యం బొగ్గు బావులపై ఫిల్టర్ నీటి సౌకర్యాన్ని కల్పించింది. కాని గుత్తెదారుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కాసిపేట గని కార్మికులకు శాపంగా మారింది. కాసి పేట 1వ గని ఫిల్టర్ బెడ్‌లోని ఇసుకను ఆరు నెలలకు ఒక సారి మార్చి శుభ్రపరచాలి. కాని కాసి పేట 1వ గనిలో ఇసుకను 7నెలలు దాటినప్పటికీ ఇసుక మార్చకపోవడం వల్ల నీటిపై బురదనీరు చేరి నీరు కలుషితమైంది. దీంతో స్నానాలు చేసిన కార్మికులు చర్మవ్యాధుల బారినపడి తీవ్ర అవస్థలు పడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిల్టర్ బెడ్‌లోని ఇసుక మార్చకపోవడంతో ఇసుక గడ్డకట్టి సిమెంటు బిల్లలా తయారైందన్నారు. దీనిపై కార్మికులు ఆందోళనలు, నిరసనలు చేపట్టడం వల్ల ప్రత్యామ్నాయంగా బయట నల్లాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికైన సింగరేణి యాజమాన్యం, అధికారులు స్పందించి ఫిల్టర్‌బెడ్‌లోని ఇసుకను మార్చి శుద్ధమైన నీటి సౌకర్యం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో

దేశంలోనే నంబర్ వన్ తెలంగాణ

రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రామగుండం కమిషరేట్ కార్యాలయంలో జెండావిష్కరణ చేసి పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మిగతా రాష్ట్రాల కంటే తక్కువ సమయంలో తెలంగాణ అభివృద్ధి పథంలో నడుస్తున్నదని, సమాజంలో శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే సమాజాభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. అన్నీ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం అబివృద్ది చెందుతుందని, పోలీస్‌శాఖ అన్నీ స్థాయిల్లో భాగస్వామ్యం అవుతూ శాంతి భద్రతల్లో ముందుందన్నారు. పోలీసులు భవిష్యత్‌లో కష్టపడి పని చేసి ప్రజల సంక్షేమం వైపు దృష్టి పెట్టాలని,సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయో గించుకుని ప్రజలకు మరింత అందుబాటులో ఉంటూ సేవలందించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహిళ భద్రత అనేది రాష్ట్రంలో మొదటి ప్రాధాన్య తలో ఉన్నదని, దానిలో భాగంగా షీటీమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీసులు నిరంతరం శాంతి భద్రతలు కాపాడడంలో శ్రమించి ప్రజల రక్షణ కోసం పాటుపడాలని, ఎలాంటి లా అండ్ ఆర్డర్ సమస్య లేకుండా చూడాలన్నారు. భవిష్యత్ రాష్ట్రాబివృద్ధిలో పోలీస్‌శాఖ ప్రత్యేకమైన స్థానం ఉండాలని సీపీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, గోదావరిఖని ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ప్రతాప్, సురేందర్ పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలక్రైం, జూన్2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి దఫా అడ్మిషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వై. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు ఆగస్టు సెషన్ కోసం ఎన్‌సీవీటీ ప్యాట్రాన్ కింద వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లలో శిక్షణ పొందడానికి రాష్ట్రంలోని గవర్నమెంట్, ప్రైవేటు ఐటీఐల్లో ఆన్‌లైన్ ద్వారా పదోతరగతి మార్కులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందని తెలిపారు.

ప్రవేశం పొందడానికి ఆగస్టు 1 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలని ఆపై వయస్సు ఎవరైన దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపా రు. జూన్ 2 నుంచి 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. అని ఒరిజినల్ సర్టిఫికేట్లు స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వెరిఫికేషన్ రుసుం 100 ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. ఆ న్‌లైన్ అప్లై చేసే సమయంలో తండ్రిపేరు, తల్లిపేరు, పుట్టిన తేదీలను ఎస్ ఎస్‌సీ మెమో ప్రకారం అప్లై చేసుకోవాలని సూచించారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలక్రైం, జూన్2 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవా లని కళాశాల చైర్మన్ పల్ల భూమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ సహకారంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో హెచ్ఎంటీ, మెడిప్లస్, పేటీఎం, జస్ట్‌డయల్, కేఫ్ నీలోఫర్, సీటుసీ, ఉన్నతి, అనుదీప్ ఫౌండేషన్, వఫేల్ నెట్, ఎంఆర్ఎఫ్ ప్రొడక్షన్, కంపెనీలు పాల్గొంటాయని ఆ సక్తిగల విద్యార్థులు ఇంటర్వ్యూకు వచ్చే ముందు ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, ఒక ఫొటోతో హాజరుకావాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ఇది సువర్ణ అవకాశమని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాదిగ హక్కుల దండోర మండల అధ్యక్షుడిగా రమేశ్

కాసిపేట,జూన్2(ఆంధ్రజ్యోతి): మాదిగ హక్కుల దండోర మండల అధ్యక్షులుగా అట్కపురం రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు కల్లెపల్లి నవీన్, నియోజకవర్గ ఇన్‌చార్జి గోగర్ల శేఖర్ సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు నవీన్ మాట్లాడుతూ మాదిగ హక్కులను కాపాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పులేటి లక్ష్మణ్, తాంద్ర నర్సయ్య, కందుకూరి వెంకటేశ్, చీకటి చంద్రయ్య, జూల మధు, సాతూరి సతీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఒక మార్పు అభివృద్ధికి మలుపు




వాకర్స్ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నగరపాలక కమిషనర్ శివాజీ

మంచిర్యాలక్రైం,జూన్2 (ఆంధ్రజ్యోతి): ఒక మార్పు అభివృద్ధికి మలుపని నగర పాలక కమిషనర్ శివాజీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో వంద రోజుల కార్యచరణతో యాక్షన్‌ప్లాన్‌తో నగరంలో 50 అంశాలతో పారిశుధ్య కార్యక్రమాన్ని, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడడం, ఇంటింటి సర్వే నిర్వహించి ఇంటి నంబర్లు లేని వారికి నెంబర్లల మంజూరు చేయడం, చిన్న చిన్న వ్యాపారస్తులకు లైసెన్స్‌లు మంజూరు చేయడం, కాలనీ బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి ప్రత్యేక కార్యచరణతో వంద రోజుల పాటు పలు కార్యక్రమాలపై ప్రతి వార్డులో అవగాహన కల్పించి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక మేనేజర్ విజయ్‌కుమార్, కరుణాకర్, శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వైకుంఠం, వాకర్స్ అసోసియేషన్ ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రశాంత్, ప్రజలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
1
మంగళవారం 3 జూన్ 2025





జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు

జిల్లా అభివృద్ధికి కృషి

● ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రగతికి బాటలు ● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు

మంచిర్యాలకలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అన్ని రంగాల్లో అభివృద్ధికి ఐక్యంగా ముందుకు సాగాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రగతికి బాటలుగా మారాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి ఎంపీ వంశీక్రిష్ణ, మంచిర్యాల బెల్లంపల్లి ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వినోద్‌లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని భారతదేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్- 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.



తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో ముఖ్యంగా పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి డెవలప్‌మెంట్, పారదర్శక సుపరిపాలనలాంటి లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తాయన్నారు. ఈ విజన్ డాక్యుమెంట్ భవిష్యత్ తెలంగాణకు ఒక భగవద్గీత, ఇది తెలంగాణ రూపురేఖలనే మార్చేస్తుందన్నారు. అదే విధంగా రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా జిల్లాలో 2కోట్ల మందికి పైగా మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. రూ. 500లకే గ్యాస్ సరఫరా ద్వారా మహిళలపై ఆర్థిక భారాన్ని తగ్గించా మన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. మహిళలు పెట్రోలు బంకుల నిర్వహణ, మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ చేపట్టామన్నారు. మహిళ సంఘాల ద్వారా 600 బస్సులను కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకివ్వాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మిగతా 5వ పేజీలో



జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ఆకట్టుకున్న స్టాళ్లు... పోలీసు పరేడ్

ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని డీఆర్‌డీఏ, శిశు సంక్షేమ, బీసీ వెల్ఫేర్, అడల్ట్ ఎడ్యుకేషన్, వ్యవ సాయ శాఖ, మత్స్య, వైద్య ఆరోగ్యశాఖ తదితర జిల్లా శాఖ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్టాళ్లను ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రేంసాగర్‌రావు, వినోద్ సందర్శించి స్టాళ్లను ఏర్పాటు చేసినందుకు అధికారులను అభినందించారు. వ్యవసాయశాఖ విత్తనాల బ్యాగులను పట్టుకొని పలు సూచనలు, సలహాలు అందజేశారు. రాష్ట్ర ఆవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి ఆర్‌ఎస్‌ఐ శివ కుమార్ నేతృత్వంలో నిర్వహించిన పోలీసు పరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్య అతిథికి గౌరవ వందనం సమర్పించి అనంతరం ఆద్యంతం ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. అదే విధంగా బైపాస్ రోడ్డ గల అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు.

కళాకారుల ఆట..పాట..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో తెలంగాణ సంస్కృతిక సారథి కళాకారులు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన ఇతివృత్తాన్ని గేయాలుగా మలిచి పాడిన జానపద గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి. వేడుకలకు ప్రారంభానికి ముందు ప్రత్యేక రాష్ట్రానికి బలిదానం చేసిన అమరవీరులను స్మరిస్తూ గీతాలు ఆలపించారు. తెలంగాణ ప్రగతికి ప్రభుత్వం సంక్షేమ పథకాలపై గీతాలు ఆకట్టుకున్నాయి.

సోనియమ్మతోనే తెలంగాణ ఏర్పాటు

మంచిర్యాలక్రైం: సోనియాగాంధీ వల్లనే తెలంగాణ ఆవతరించిందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆయన నివాసంలో జెండాను ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగుకోట్ల ప్రజలందరికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూముల నరేశ్, పూదరి తిరుపతి, పెంట రజిత, మామిడిశెట్టి వసుందర, తాజా మాజీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్టాళ్లను సందర్శిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాల్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్



కాకా వెంకటస్వామి విగ్రహానికి పూల మాలలు వేస్తున్న ఎంపీ వంశీ



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న హర్కర వేణుగోపాల్, ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్‌దీపక్, నాయకులు

కేసీఆర్‌తోనే తెలంగాణ ఏర్పాటు



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలక్రైం, జూన్2 (ఆంధ్రజ్యోతి):. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పోరాటాలతో, ఎందరో త్యాగాల ఫలితంగా తెలంగాణ ఆవిర్భవించిందని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. సోమవారం అమర వీరుల స్థూపానికి నివాళులు అర్పించి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, పెంట రాజయ్య, ఎర్రం తిరుపతి, పల్ల భూమేశ్, గాదె సత్యం, నాయకులు పాల్గొన్నారు.

పట్టణ ప్రగతి, పారిశుధ్య నిర్వహణ ప్రతీ ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజలింగు

మందమర్రిటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రగతితో పాటు పారిశుధ్య నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా కోల్‌బెల్ట్ రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్యం, పట్టణ ప్రగతిపై అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, చిన్న వ్యాపారు లను గుర్తించి ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయడం, ఉచిత వైద్య శిబిరాలు ,పరి సరాల పరిశుభ్రత గురించి తెలియజేయడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. డీఈ సుమతి, మున్సిపల్ ఇంజనీర్ సందీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, ఆర్‌ఐ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ రాణి, హెల్త్ అసిస్టెంట్ సమీర్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

నెరవేరనున్న నిరుపేదల సొంతింటి కల

ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నస్పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలైన లబ్ధిదారులకు సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్ల ద్వారా ప్రభుత్వం నెర వేరుస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్ రావు అన్నారు. నస్పూర్ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్‌లో అర్హులైన పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పంపి ణీ చేశారు. మంచిర్యాల- 509, నస్పూర్-529 మంది, హాజీపూర్-162 మంది లబ్ధిదాలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం తాము కట్టుబడి ఉన్నామని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు అందించే విధంగా మాటలు నిలబెట్టుకుంటామన్నారు. మంచి ర్యాలలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠ శాలలను నిర్మిస్తున్నమన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా అండర్ గ్రౌండ్ కేబుల్ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంచిర్యాలలోనే పైలెట్ ప్రాజెక్టు ద్వారా మొదలైందన్నారు. నస్పూర్‌లో 15 పడకలతో ఈఎస్‌ఐ హాస్పిటల్ అందుబాటులోకి రానుందన్నారు. మంచిర్యాలలో సూపర్ స్పెషా లిటీ ఆసుపత్రిని తొలిసారిగా జిల్లాలోనే చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికి రేషన్ కార్డులు అందిస్తామ న్నారు. ప్రభుత్వ ప్రజల ఆస్తులను దోచుకున్న వారిని నుంచి తిరిగి ప్రజలకు చేందే విధంగా లెక్కను సరిచేస్తానని, ప్రజలకు అన్యాయం చేసిన ఎవర్ని వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ శివాజీ, నస్పూర్, మంచిర్యాల, హాజీపూర్ తహసీల్దార్లు సంతోష్‌కుమార్, రఫతుల్లా, శ్రీనివాస్‌దేశ్ పాండే కాంగ్రెస్ నాయకులు సుర్మిళ వేణు, పూదరి తిరుపతి, కలీద్, తూముల నరేష్, సంజీవ్, డేగ బాపు, ఒడ్డె రాజమౌళి, రజిత పాల్గొన్నారు.



ఇళ్ల పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ప్రతీ వార్డును సుందరంగా తీర్చిదిద్దుతాం

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ

బెల్లంపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 34 వార్డులను సుందరంగా తీర్చి దిద్దుతామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఒక కోటి 11లక్షల రూపాయల సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో మున్సిపాలిటిల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రజా సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తోందన్నారు. ప్రతి వార్డులో సీసీ రోడ్డులు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తిచేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పట్టణం లో ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకరావాలని నాయకులకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో అధ్వాన్నంగా మారిన రహదారులు, పారిశుధ్య నిర్వహణ వంటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు.

అనంతరం పట్ట ణంలోని ఏఎంసీ ఏరియాలో గల స్వర్గీయ కాక వెంకట స్వామి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఉద్య మనాయ కుడిగా పేరు పొందిన కాకా వెంకటస్వామి అని కొనియాడారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అమ్జద్ ఇటీవల అనారో గ్యానికి గురి కావడంతో పరామర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారుకూరి రాంచందర్, నెల్లి రమేశ్, బండి ప్రభాకర్, గెల్లి రాజ లింగు, అప్సర్, దావ రమేశ్‌తో పాటు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్

లారీ యజమానుల రిలే దీక్ష



దీక్ష చేస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ యజమానులు

నస్పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణంలో తీగల్‌పహాడ్ గోదాముల వద్ద న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోల్ బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యజమానుల ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరహార దీక్ష చేపట్టారు. సీసీఐ అధికారులు తమ సమ స్యల పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం చే యడం వల్లనే తమ ఆందోళన చేపట్టినట్లు యజమానులు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన లారీలు తక్కువ అద్దెలకు తెప్పించి ఇక్కడి నుంచి లోడింగ్ చేపిస్తున్నారని ఆరోపించారు. సీసీఐ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్ప డిందన్నారు. దీంతో వందలాది మంది లారీ యజమానుల కుటుంబాలు వీధినపడే పరి స్థితి ఏర్పడిందన్నారు. సీసీఐ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో కోల్‌బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుండా సురేశ్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ బాస్కర్ల సుమన్, ప్రధాన కార్యదర్శి రాందేని రమేశ్, జాయింట్ సెక్రెటరీ అరికోల్ల రమేశ్, కల్చరర్ సెక్రెటరీ గుడికందుల తిరుపతి, ఆర్గ నైజింగ్ సెక్రెటరీ దాసరి పవన్ పాల్గొన్నారు.

అక్షర సాహితీ సంస్థ ఏర్పాటు

లక్షెట్టిపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని సోమవారం లక్షెట్టిపేటకు చెందిన కవులు, కళాకారులు అక్షర సాహితి పేరుతో నూతన సంస్థను ఏర్పాటు చేసారు. దీనికి అధ్యక్షులుగా నూటెంకి రవీంద్ర, ప్రధానకార్యదర్శిగా వేనంక చక్రవర్తి, సంయుక్త కార్యదిర్శగా శ్రీనివాస్, కోశాధికారిగా లేదాళ్ల రాజేశ్వర్‌రావులను నియమించారు. వీరికి గౌరవ అద్యక్షులుగా తిరుపతిని నియమించారు.

ప్రభుత్వ పాఠశాలపైనే ఆసక్తి

బడిబాటకు ముందే అడ్మిషన్ల కోసం వస్తున్న విద్యార్థులు

ఒకే రోజు 34 మంది అడ్మిషన్లు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

జన్నారం, జూన్2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మారుతున్న సమాజంతో పోటీపడి ప్రైవేటు పాఠశాలల వైపు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు ఓ వైపు ఉంటే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను బోధిస్తూ మంచి ఫలితాలు రాబడుతున్న ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లి దండ్రులు పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. జన్నారం మండలంలో ప్రైవేటు పాఠశాలలకు వివిధ మండలాల నుంచి పక్క జిల్లా నుంచి కూడ వచ్చి కార్పొరేట్ పాఠశాలలో వేలల్లో ఫీజులు ఉన్నప్పటికీ కష్టపడి కడుతూ చేర్పిస్తుంటారు. కాని మండలంలోని అక్కెపల్లి గూడ ప్రభుత్వ పాఠశాలలో మాత్రం స్థానికంగా విద్యా ర్థులను చేర్పించేందుకు ఆసక్తి చూపుతారు. గత ఏడాదైతే ఈ పాఠశాలలో అడ్మిషన్లు లేవని బోర్డు పె ట్టిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది బడిబాటకు ముందే విద్యార్థులను చేర్పిస్తున్నారు. జూన్ 6వ తేదీ నుంచి బడిబాట ప్రారంభం కానుంది. బడిబాట ప్రారంభం కాగానే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని విద్యార్థుల వద్దకు ఉపాధ్యాయులు వెళ్లే పరిస్థితి ఉండేది. ఈ అప్పర్ ప్రైమరి పాఠశాలలో అడ్మి షన్లు దొరుకుతాయో లేదో అనే భయంతో సోమవా రం ఏకంగా 34 మంది విద్యార్థులు ఒకే రోజు అడ్మి షన్లు పొందారు. దీంతో బడిబాట ప్రారంభానికి ముందే 70 సీట్లకుగాను 34 మంది చేరు కోవడంతో సీట్లు సరిపోతాయో లేదోనన్న పరిస్థితి నెలకొంది.

గత ఫలితాలతోనే విద్యార్థుల చేరిక...

ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా నిర్వహిస్తున్న జాజాల శ్రీనివాస్ గతంలో పొన్కల్ పాఠశాలలో పని చేసినప్పుడు సైతం విద్యార్థులు అత్యధికంగా చేరి గురుకుల, మోడల్ స్కూళ్లలో సీట్లు సాధించారు. గతేడాది బదిలీపై అక్కెపల్లి గూడ పాఠశాలకు రావడంతో అక్కడి విద్యార్థులు సారుతోనే మేము అంటూ చాలా మంది విద్యార్థులు ఈ పాఠశాలకు వచ్చారు. ఈ పాఠశాలల్లో గురుకుల, మోడల్ స్కూల్ వంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులు అత్యధికంగా అర్హత సాధించారు. ఈ ఏడాది కూడ పాఠశాలలో అత్యధికంగా విద్యార్థులు వచ్చే అవకాశాలు లేక పోలేదు. ఒకే రోజు 34 మంది అడ్మిషన్లు రావడం పట్ల ఎంఈవో విజయ్‌కుమార్ సిబ్బందిని అభినందించారు.

పదోతరగతి సప్లమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు చేసిన అధికారులు

మంచిర్యాలక్రైం, జూన్2 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జరిగే పదోతరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం 412 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మంచిర్యాల కేంద్రంలోని జడ్‌పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో సెంటర్‌ను ఏర్పాటు చేశామని, సెంటర్ లోకి ఎవ్వరు సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకరాకూడదని తెలిపారు. విద్యార్థులు ఒక గంటల ముందుగానే చేరుకో గానే విద్యార్థుల హాల్‌టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునని తెలిపారు. పరీక్ష విషయంలో ఎవరికైన సందేహాలు ఉంటే 7032463114 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.